

సూపర్ ఫాలోయింగ్



- జూనియర్ సూపర్‌స్టార్ కృష్ణకు విశేష ఆదరణ
- ఇన్‌స్టాలో 1.45 లక్షలు, ఫేస్‌బుక్‌లో 1.13 లక్షల ఫాలోవర్స్
- యూట్యూబ్‌లో 1.62 లక్షల మంది సబ్‌స్ర్కైబర్లు
- రీల్స్‌తో లక్షల్లో లైకులు కొల్లగొడుతున్న చిట్టిబాబు

- 8లో

హరహర మహాదేవ

కిటకిటలాడిన శివాలయాలు

- ఘనంగా కార్తీక మాస తొలి సోమవారం పూజలు



అనకాపల్లి కాశీవిశ్వేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాలయాలన్నీ కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు జరిగాయి. పరమేశ్వరుని దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. శివునికి పూజలు చేసి ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో రాత్రి భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

డీఎస్సీకి రంగం సిద్ధం

రేపే నోటిఫికేషన్ విడుదల?

- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు 734
- స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో 518...
- సెకండరీ గ్రేడ్ 216
- ఎస్జీటీలో తెలుగు 205, ఉర్దూ 11 ఖాళీలు



విశాఖపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నిర్వహణకు 'కూటమి' రంగం సిద్ధం చేస్తోంది. ఈ నెల ఆరో తేదీన నోటిఫికేషన్ విడుదల కానున్నది. దీనికి అనుగుణంగా సోమవారం టెట్ ఫలితాలు విడుదల చేశారు.

ఖాళీల వివరాలు

సబ్జెక్టు	కేటగిరీ	జడ్పీ/ ప్రభుత్వ	మునిసిపల్	మొత్తం
గణితం	ఎస్ఎ	57	2	59
పీఎస్	డిటో	36	3	39
బీఎస్	డిటో	52	10	62
సోషల్	డిటో	88	06	94
తెలుగు	డిటో	24	10	34
హిందీ	డిటో	28	04	32
ఇంగ్లీష్	డిటో	52	07	59
పీడీ	డిటో	139	00	139
ఎస్జీటీ (తెలుగు)		139	66	205
ఎస్జీటీ (ఉర్దూ)		10	01	11
మొత్తం		625	109	734

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 734 ఖాళీలు ఉన్నట్టు విద్యా శాఖ గుర్తించింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపింది. అటుఇటుగా సుమారు 1,000 ఖాళీలు ఉంటాయని అధికారులు నాలుగు నెలల క్రితం చెప్పారు. తీరా ఇప్పుడు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో మాత్రం 734 ఖాళీలు ఉన్నట్టు పొందుపరిచారు. వీటిలో జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో 625, మునిసిపల్ పాఠశాలల్లో 109 ఖాళీలు ఉన్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ-తెలుగు) ఖాళీలు 205, ఉర్దూ 11 ఖాళీలు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో గణితం 59, ఫిజికల్ సైన్స్ 39, బయాలజీ 62, సోషల్ స్టడీస్ 94, తెలుగు 34, హిందీ 32, ఇంగ్లీష్ 59, ఫిజికల్ డైరెక్టర్ 139...మొత్తం 518 పోస్టులు ఉన్నాయి. అయితే ఏజెన్సీలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉపాధ్యాయ ఖాళీలను తాజా నోటిఫికేషన్‌లో పొందుపరచలేదు. 2018లో చివరిసారిగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసి ఖాళీలు భర్తీచేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కసారి కూడా ఉపాధ్యాయ నియామకాలు

... మిగతా 8వ పేజీలో

గుంతల రోడ్లకు మోక్షం

తొలివిడత 68 ఆర్అండ్‌బీ రహదారులు మరమ్మతు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు తీవ్ర నిర్లక్ష్యం చేసిన రహదారులకు మరమ్మతు పనులు చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 'మిషన్ ఫర్ పాట్‌హోల్ ఫ్రీ రోడ్స్' పథకం కింద ఆర్అండ్‌బీ రోడ్లపై గుంతలను కప్పేందుకు తొలి దశ కింద రూ4.5 కోట్లు మంజూరయ్యాయి. మరో రూ.9 కోట్లతో 120 రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

- రూ.4.5 కోట్లు కేటాయింపు
- ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ప్రారంభం..రేపటితో ముగింపు
- కాంట్రాక్టర్లకు పనులు అప్పగింత
- డిసెంబరు చివరి నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక
- రెండో దశలో 120 రోడ్ల పనులకు రూ.9 కోట్లతో ప్రతిపాదనలు

వైసీపీ పాలనలో రహదారుల నిర్వహణ, అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఐదేళ్ల కాలంలో రోడ్లపై పడిన గుంతలను పూడ్చలేని పరిస్థితి నెలకొంది. దీంతో రహదారులన్నీ గోతుల మయంగా మారాయి. వర్షం కురిస్తే నీరు చేరి పంట కుంటలను తలపిస్తున్నాయి. కొన్నిచోట్ల అయితే పరిస్థితి అత్యంత దారుణంగా తయారై రోడ్డు ఎక్కడుందా అని వాహన చోదకులు వెతుక్కోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. అధ్వానంగా వున్న రోడ్ల కారణంగా ప్రమాదాలు సంభవించి పలువురు ప్రాణాలు కోల్పోయారు. మరెంతో మంది క్షతగాత్రులయ్యారు. రహదారులకు మోక్షం లేదా? అని జనం అనుకుంటున్న తరుణంలో ఎన్నికలు జరిగి, కూటమి అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధ్వాన రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తున్నది. 'మిషన్ ఫర్ పాట్‌హోల్ ఫ్రీ రోడ్స్' కింద తొలుత రహదారులపై గుంతలు పూడ్చాలని అధికారులను ఆదేశించింది. ముఖ్యమంత్రి



ఎలమంచిలి-గాజువాక రహదారిలో పరవాడ మండలంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

చంద్రబాబు నాయుడు ఇటీవల పరవాడ మండలం వెన్నెలపాలెంలో రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆదేశాల మేరకు 'మిషన్ ఫర్ పాట్‌హోల్-ఫ్రీ రోడ్స్' కింద జిల్లాలో రోడ్ల నిర్వహణ పనుల కోసం ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు.

జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి ఆర్అండ్‌బీ డివిజన్‌ల పరిధిలో 1,402 కిలోమీటర్ల రోడ్లు ఉన్నాయి. వివిధ మార్గాల్లో సుమారు 120 రోడ్లు ధ్వంసమయ్యాయి. ఎలమంచిలి నుంచి అచ్యుతాపురం, పరవాడ మీదుగా గాజువాక వెళ్లే ప్రధాన రహదారి అత్యంత దయనీయంగా వుంది. అనకాపల్లి నుంచి వెంకన్నపాలెం మీదుగా చోడవరం వెళ్లే రోడ్డు, లంకెలపాలెం నుంచి సబ్బవరం మండలం అసకపల్లి జాతీయ రహదారి వరకు రోడ్డు పూర్తిగా పాడయ్యాయి. ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్లపై ప్రయాణించే వారు నానాఅవస్థలు పడుతున్నారు. ఇటువంటి ప్రధాన రోడ్లపై ఏర్పడిన గోతులను పూడ్చడానికి అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు.

తొలి దశ పనులకు రూ.4.5 కోట్లు

'మిషన్ ఫర్ పాట్‌హోల్ ఫ్రీ రోడ్స్' పథకంలో భాగంగా ఆర్అండ్‌బీ రోడ్లపై పడిన భారీ గుంతలను కప్పించే పనులకు శ్రీకారం చుట్టారు. తొలి దశ పనుల కోసం రూ.4.5 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ మొదలైంది. ఒక్కో రోడ్డుకు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలు వరకు

... మిగతా 8వ పేజీలో


అపార్‌కు ఆపసోపాలు

తప్పుల తడకగా విద్యార్థుల ఆధార్ వివరాలు

- జనన ధ్రువపత్రం ఉంటేనే సవరణలు
- అపార్ ప్రక్రియకు అవరోధంగా మారిన వైనం
- జనన ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాలకు పరుగు
- ఈ నెల 30వ తేదీ వరకే గడువు



విద్యార్థులకు ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం



నమూనా అపార్ కార్డు

రోలుగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) కోసం విద్యార్థులు నానా ఇక్కట్లు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పలువురు విద్యార్థులకు జనన ధ్రువీకరణ పత్రాలు లేవు. అపార్ నమోదుకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. దీంతోపాటు తప్పులు లేని ఆధార్ కార్డులు వుండాలి. దీంతో జనన ధ్రువీకరణ పత్రాలు పొందడానికి రెవెన్యూ, పంచాయతీ కార్యాలయాలు, ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కింద నుంచి పైస్థాయి వరకు ఈ ప్రక్రియ పూర్తికావడానికి నెల రోజులు పడుతున్నది. మరోవైపు ఆధార్ నమోదు కేంద్రాలు లేని మండలాల్లో విద్యార్థులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు.

జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి గుర్తింపు కార్డు జారీకి ప్రభుత్వం ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్)ను ప్రారంభించింది. వన్ నేషన్-వన్ స్టూడెంట్ ఐడెంటిటీ పేరుతో విదార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఒకటి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులకు అపార్ నమోదు జరుగుతునది. జిల్లాలో 1,813 ప్రభుత్వ/ ప్రైవేటు పాఠశాలలు, 145 ప్రభుత్వ/ ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రతీ విద్యార్థికి పాఠశాలలో నమోదైన వివరాలు, ఆధార్‌లో ఉన్న వివరాలు ఒకేలా ఉండాలి. అయితే 70 శాతం మంది పిల్లలకు పాఠశాలలో ఒక విధంగా, ఆధార్‌లో మరోలా వివరాలు ఉన్నాయి. ఈ సమస్య ఉన్న వారంతా ఆధార్ నమోదు కేంద్రాలకు వెళ్లి సవరించుకున్న తర్వాతనే అపార్‌లో నమోదు చేసుకోవాలి. ఈ కార్డుల జారీ బాధ్యతలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించింది. ఈ నెల

... మిగతా 8వ పేజీలో

ఇది జలం కాదు.. గరళం

- ఫార్మా వ్యర్థాలతో కలుషితమైన మల్లోడి గెడ్డవాగు
- రసాయన వ్యర్థాలను శుద్ధి చేయకుండా బయటకు విడుదల
- తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న నియంత్రణ శాఖల అధికారులు



ప్రస్తుతం ఫార్మా వ్యర్థాలతో నల్లగా మారిన గెడ్డ నీరు

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

పరవాడ నుంచి భరిణికం వెళ్లే రహదారిలో మల్లోడిగెడ్డ వాగు ఫార్మా వ్యర్థాలతో నిండిపోయి నీరంతా నల్లగా తయారైంది. వాగు పొడువునా నీటిపై పెద్ద ఎత్తున నల్లటి తెట్టు తేలింది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు.

ఫార్మాసిటీలోని పలు పరిశ్రమల యాజమాన్యాలు నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. రసాయన వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా బయటకు విడిచిపెట్టేస్తున్నాయి. అవి గెడ్డలు, చెరువుల్లోకి చేరి కాలుష్య కాసారాలుగా మారుస్తున్నాయి. వర్షాలు కురిసినప్పుడు రసాయన వ్యర్థ జలాలను డ్రైన్ల ద్వారా గెడ్డల్లోకి విడిచిపెడుతున్నారు. గెడ్డల్లో నుంచి వర్షం నీరు చెరువుల్లోకి చేరుతుండడంతో రసాయన వ్యర్థాలు కూడా వచ్చి చేరుతున్నాయి. ఇప్పటికే పరవాడ పెద్ద చెరువు పూర్తిగా కలుషితమైంది. ఇందులోని నీటిని పశువులు, ఇతర జీవరాశులకు తాగడంలేదు. ఈ నీరు పంటల సాగుకు కూడా పనికి రాదని రైతులు ఆవేదనతో చెబుతున్నారు.

ఫార్మా వ్యర్థ జలాలను చెరువులు, గెడ్డల్లోకి ఇష్టానుసారంగా విడిచిపెడుతున్నప్పటికీ సంబంధిత నియంత్రణ శాఖల్లో ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు

... మిగతా 8వ పేజీలో



గత నెలలో వర్షాలు కురిసినప్పుడు మల్లోడిగెడ్డలో నీరు

పెన్సిల్ ముల్లుపై నాగేంద్రుడు





పెన్సిల్ ముల్లుపై చెక్కిన మూడు తలల నాగేంద్రుడు (ఇన్‌సెట్) సూక్ష్మ కళాకారుడు నైదండ గోపాల్

మాడుగుల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

పెన్సిల్ ముల్లుపై మూడు తలలతో పడగవిప్పిన నాగేంద్రుడి అవతారాన్ని మండలంలోని ఎం.కోడూరుకి చెందిన సూక్ష కళాకారుడు నైదండ గోపాల్ అద్భుతంగా చెక్కాడు. మంగళవారం నాగుల చవితి పండుగ సందర్భంగా దీనిని తయారు చేసినట్టు చెప్పాడు. దీనిని రూపొందించడానికి సుమారు మూడు గంటల సమయం పట్టిందన్నాడు. పండగలు, ప్రత్యేక రోజుల్లో సూక్ష్మ కళాఖండాలను తయారు చేయడంతో గోపాల్ ప్రసిద్ధి చెందాడు.

ఆదమరిస్తే అంతే!

ప్రమాదకరంగా పూడిమడక పాగిరి ప్రాంతం

- సముద్రంలో పోటు సమయంలో అలల ఉధృతి
- అంచనా వేయలేక నీటిలో దిగి ప్రాణాలు కోల్పోతున్న సందర్శకులు
- రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్

అచ్యుతాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

మండలంలో సముద్ర తీరంలో వున్న పూడిమడక పొగిరి ప్రాంతం ఎంత ఆహ్లాదకంగా, అందంగా ఉంటుందో.. అజాగ్రత్తగా వుంటే అంతే ప్రమాదకరంగా మారుతుంది. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల సరిహద్దులో వున్న ఈ ప్రాంతం ప్రకృతి అందాలకు నిలయం. అదే విధంగా మృత్యుకుహరంగా కూడా పేరు పడింది. ఇక్కడ అలల ఉధృతిని అంచనా వేయలేక పలువురు ప్రాణాలు కోల్పోయారు. రెండేళ్ల క్రితం ఒకే కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు పూడిమడక పొగిరి ప్రాంతంలో మృత్యువాతపడ్డారు. అత్యంత ప్రమాదకరమైన ఈ ప్రాంతంలో ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ఆటు సమయంలో సముద్రంలో బయటకు కనిపిస్తున్న రాళ్లు

అచ్యుతాపురం-రాంబిల్లి మండలాల సరిహద్దుల్లో పూడిమడక పొగిరి ప్రాంతం ఉంది. రాంబిల్లి మండలం సీతపాలెం తీరంలో కొండ ఉంది. ఈ కొండ ఎక్కి చూస్తే మూడు వైపులా నీలి రంగు సముద్రం కనిపిస్తుంది. సూర్యోదయం సమయంలో చేపల వేటకు వెళ్లే పడవలు, సముద్రం గర్భాన్ని చీల్చుకుంటూ వస్తున్నట్టు కనిపించే భానుడు.. ఈ దృశ్యాలను తిలకించడానికి రెండు కళ్లూ చాలవంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. తీరంలో కొండ వుండడంతో ఇక్కడ అలల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. రోజుకి రెండుసార్లు

... మిగతా 8వ పేజీలో

చవితి వేడుకలకు నాగేంద్రుని ఆలయం సిద్ధం

ఎలమంచిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాగేంద్రకాలనీలోని నాగేంద్రస్వామి ఆలయాన్ని చవితి వేడుకలకు కమిటీ సభ్యులు సిద్ధం చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నాగేంద్రస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం కృత్రిమ పుట్టను ఏర్పాటు చేశారు. మంగళవారం నాగుల చవితి వేడుకల్లో భాగంగా ఆలయం వద్ద భక్తుల రద్దీ కోసం ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేసి మరిన్ని వసతులు కల్పించారు.

11న మునగపాక శూలాల సంబరం

▸▸ గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉత్సవాల్లో ఒకటైన సాంబమూర్తి శూలాల సంబరం గోడ పత్రికను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోమవారం ఆవిష్కరించారు. స్థానిక పల్లపువీధిలో ఉన్న సాంబమూర్తి దేవస్థానంనకు వచ్చిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు సాదరస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన జరగనున్న శూలాల సంబరం సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో ప్రారంభమైన రిమ్ జిమ్-2024



వివిధ వేషధారణలతో అలరిస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో సోమవారం రిమ్‌జిమ్-2024 ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకోగా విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు, పాటలతో అలరించారు. అంతకుముందు కార్యక్రమాన్ని ప్రారంభించిన విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ వరకు జరిగే ఈ రిమ్‌జిమ్‌లో సాహిత్యం, సంగీతం, ఆటల పోటీలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్ వంటి 29 అంశాల్లో జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాల్లో నిర్వహించబడుతుందన్నారు. ఈ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యాసంస్థలకు చెందిన పాయకరావుపేట, తుని, అన్నవరం శాఖలకు చెందిన 4,500 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని, చివరిరోజు ఈనెల 9వ తేదీన ముగింపు కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, అకడమిక్ ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

▸▸ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

రాంబిల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతంగా చేపట్టాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ ఎంతో బలంగా ఉందని, 50 వేలు సభ్యత్వం చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వార్డుకు 300 వరకు సభ్యత్వాలు చేయాలని సూచించారు. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ లాలం భవాని మాట్లాడుతూ మండలంలో టీడీపీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు పార్టీశ్రేణులు ఐక్యతగా ఉండి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు రవిరాజు, సీనియర్ నాయకులు రవిరాజు, టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షులు ఎరిపిల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ హవల్దార్‌కు కన్నీటి వీడ్కోలు

▸▸ సైనిక లాంఛనాలతో శివశంకరరావు అంత్యక్రియలు



శివశంకరరావు పార్థీవ దేహం వద్ద విలపిస్తున్న ఆయన భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు. (ఇన్‌సెట్‌లో) శివశంకరరావు (ఫైల్‌ఫొటో)

రాంబిల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమిలి గ్రామంలో హవల్దార్ గంగిరెడ్ల శివశంకరరావు (39) అంత్యక్రియలు సోమవారం సైనిక లాంఛనాలతో నిర్వహించారు. శ్రీనగర్ లడక్ ప్రాంతంలో విధి నిర్వహణలో ఉండగా ఈనెల 1వ తేదీన ఆయన గుండెపోటుతో మృతి చెందారు. ఆయన పార్థీవ దేహాన్ని ఆర్మీ అధికారులు సోమవారం ఉదయం అచ్యుతాపురం జంక్షన్ నుంచి ఊరేగింపుగా స్వగ్రామమైన దిమిలికి తీసుకువచ్చారు. శంకరరావు మృతదేహాన్ని చూసి భార్య కృష్ణవేణి, కుమార్తెలు జగదీశ్వరి, దివ్య, కుమారుడు యశ్వంత్, తల్లిదండ్రులు సన్యాసినాయుడు, వరహాలు, సోదరులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. ఆర్మీ, నేవీ అధికారులు మృతదేహంపై జాతీయ జండాను కప్పి, గాలిలో మూడు సార్లు కాల్పులు జరిపారు. విధి నిర్వహణలో వేసుకున్న యూనిఫారం, జాతీయ జెండాను ఆర్మీ అధికారులు ఆయన భార్య కృష్ణవేణికి అందజేశారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బస్టాండ్‌లోకి అన్ని బస్సులు రాకపోకలకు చర్యలు

ఎలమంచిలి, నవంబరు 4: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోకి అన్ని బస్సులు రాకపోకలు సాగించేందుకు చర్యలు చేపట్టాలని మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం బస్టాండ్‌లోని ఇన్‌గేటు, అవుట్‌గేటు స్థలాలతోపాటు ట్రాఫిక్ ఐలాండ్ కోసం నిర్మించిన స్థలాన్ని అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. బస్సులు రాకపోకలు సాగించే ఇన్‌గేట్, అవుట్‌గేట్ వద్ద ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా మునిసిపల్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, ఆర్టీసీ అధికారులు వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆమె ఆదేశించారు. ఈ నివేదికపై ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో చర్చించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరాజు, టీపీఓ శ్రీలక్ష్మి, ట్రాఫిక్ ఎస్‌ఐ రామకృష్ణ, ఆర్టీసీ అధికారి వర్మరాజు, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, నాగ త్రినాథగుప్తా, కౌన్సిలర్ సంతోష్, దూది నరసింహమూర్తి, బీబీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక సమావేశం

ఎస్.రాయవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో అభివృద్ధి పనులపై చర్చించి, వాటిని తీర్మానించారు. ఎంపీటీసీ సభ్యులకు నిధులు విడుదల, మండల పరిషత్ కార్యాలయ నిర్వహణ ఖర్చులపై కూడా తీర్మానించారు.

నేడు ఎలమంచిలి పాంచరాత్ర ఉత్సవాల తీర్థం

భారీగా తరలిరానున్న భక్తులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు.. 200 మంది పోలీసులతో బందోబస్తు


భూలోకమాంబ అమ్మవారు


ఇస్కాన్ టెంపుల్ సెట్


సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఎలమంచిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాంచరాత్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జరగనున్న తీర్థ మహోత్సవానికి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏటా దీపావళి రోజు నుంచి నాగుల చవితి వరకూ ఈ ఉత్సవాలు జరుపుకొని, చవితి రోజు రాత్రి తీర్థాన్ని నిర్వహిస్తారు. తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారు, పాతవీధిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వాముల వద్ద పంచరాత్ర ఉత్సవాలను 80 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నారు. జంతుబలి లేకుండా నిర్వహించే ఈ ఉత్సవం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. ఉత్సవ కమిటీ చైర్మన్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, ఆలయ ధర్మకర్త, మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి రెండు ఉత్సవ కమిటీల ప్రతినిధుల పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భూలోకమాంబ, సుబ్రహ్మణ్యేశ్వర స్వాముల ఆలయాలను విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. ఆలయ పరిసరాలు వద్ద భారీ విద్యుత్ సెట్టింగ్‌లు, పట్టణ ప్రధాన వీధుల్లో వేంకటేశ్వర స్వామి, తదితర భారీ సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

తీర్థం నిమిత్తం 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. తీర్థానికి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. చోరీలకు అవకాశం లేకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సీఐ ధనుంజయరావు పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు జరిగాయి. తీర్థాన్ని దృష్టిలో ఉంచుకుని సాయంత్రం నుంచి పట్టణంలోకి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. పట్టణంలోని ఎటువంటి వాహనాలు రాకుండా నాలుగు ప్రధాన జంక్షన్‌ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు.

తీర్థం ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ

ఎలమంచిలిలో మంగళవారం రాత్రి జరిగే తీర్థం ఏర్పాట్లను జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా సోమవారం పరిశీలించి, పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. తొలుత తులసీనగర్ భూలోకమాంబ అమ్మవారిని ఎస్పీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎస్పీకి జ్ఞాపికను అందజేశారు. మంగళవారం రాత్రి జరిగే కార్యక్రమాల వివరాలను చైర్‌పర్సన్, ఆలయ ధర్మకర్త రమాకుమారి జిల్లా ఎస్పీకి వివరించారు. అనంతరం పలు చోట్ల జరగనున్న స్టేజీ ప్రోగ్రామ్‌లను పరిశీలించారు. ప్రతీ కార్యక్రమం వద్ద సీసీ కెమెరాలు అందుబాటులో ఉంచాలని డీఎస్పీ, సీఐలకు సూచించారు. కార్యక్రమాలను రాత్రి 11 గంటలకు ముగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ సత్యనారాయణ, సీఐ ధనుంజయరావు, ఎస్‌ఐ సావిత్రి, రామకృష్ణ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


పోలీసు అధికారులకు సూచలిస్తున్న ఎస్పీ తుహీన్ సిన్హా

పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు

ఎలమంచిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాంచరాత్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించే తీర్థానికి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. సోమ వారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. తీర్థంలో పోలీసులతోపాటు మఫ్టీలోనూ పోలీసులు విధులు నిర్వర్తిస్తార న్నారు. పట్టణంలోకి ఉదయం 11 గంటల నుంచి భారీ వాహనాలు రాకపోకలను నిషేధిం చినట్టు చెప్పారు. పరిశ్రమల బస్సులు అనకాపల్లి మీదుగా రాకపోకలు ఉంటాయన్నారు. అచ్యుతాపురం నుంచి వచ్చే వాహనాలన్నీ ఎలమంచిలి కల్కి పెట్రోలు బంకు సమీపంలోని పెంకులు మిల్లు స్థలంలో, ఎస్.రాయవరం నుంచి వచ్చే వాహనాలన్నీ రామచంద్రమ్మ ఆలయం వద్ద, అడ్డురోడ్డు పులపర్తి ప్రాంతాల నుంచి వాహనాలు విజయలక్ష్మి పెట్రోలు బంకు సమీపంలోని ఖాళీ స్థలంలో, అనకాపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు చెరకు కొనుగోలు కేంద్రం వద్ద పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ధనుంజయరావు, ఎస్‌ఐ సావిత్రి, రామకృష్ణ పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభో.. శంకర


నక్కపల్లి: భక్తులతో కిటకిటలాడిన ఉపమాక శివాలయం


రాంబిల్లి: పంచదార్ల ఆకాశధార వద్ద కార్తీక స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

రాంబిల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం తొలి సోమవారం పంచదార్ల పుణ్యక్షేత్రం శివ నామస్మరణతో మార్మోగింది. వేకువజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు ధర్మలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఆలయ ప్రాంగణంలోని సహస్రలింగేశ్వరస్వామి, రాధామాధవస్వామి, సాయిబాబా, ద్విముఖ వినాయకుడులకు పూజలు చేశారు. అలాగే మండలంలోని లాలంకోడూరు, దిమిలి, కట్టుబోలు, కొత్తపట్నం, వెల్చూరు గ్రామాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పాయకరావుపేటలో.. కార్తీకమాస మొదటి సోమవారం పురస్కరించుకొని స్థానిక లింగాలతోట కాలనీలో ఉమాకోటిలింగేశ్వరస్వామి ఆలయం, బృందావనంలోని శివాలయం, తాండవనది అవతల ఉన్న కత్రాళ్లకొండ వద్ద ఉన్న శివాలయం తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. శివ స్వాములు, అయ్యప్ప స్వాములు, భక్తులు శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాయకరావుపేట రూరల్‌లో.. కార్తీకమాసం మొదటి సోమవారం మండలంలోని సత్యవరం, రాజగోపాలపురం, పెంటకోట, గోపాలపట్నం సీతమ్మవారి కొండ, పెద్దిపాలెం, నామవరం శివాలయాల్లో భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. సీతమ్మవారి కొండ, పెద్దిపాలెం, పెంటకోట శివాలయాలలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

ఎలమంచిలిలో.. కార్తీక మాసం తొలి సోమవారం పట్టణంతోపాటు మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని కొత్తపేటలో రామలింగేశ్వరస్వామి ఆలయం, శేషుగెడ్డ వద్ద, కొక్కిరాపల్లి, బైపాస్ రోడ్డులోని సోమస్కంద స్వామి ఆలయం, సోమలింగపాలెంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఏటికొప్పాకలోని విశ్వేశ్వర స్వామి ఆలయం, పీఎన్‌ఆర్‌పేట,పులపర్తి గ్రామాల్లోని శివాలయాలకు తెల్లవారు నుంచి భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాలు చేపట్టారు.

నక్కపల్లిలో.. మండలంలోని ఉపమాక ప్రాచీన శివాలయం కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున 3 గంటలకు ఆలయంలో వున్న త్రినేత్రుడికి అర్చకులు వెలవలపల్లి మహేశ్, సంతోశ్ పంచామృతాభిషేకాలు నిర్వహించి,సప్తహారతులిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. గొడిచెర్ల శేషలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

ఎస్.రాయవరంలో.. కార్తీకమాసం మొదటి సోమవారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎస్.రాయవరం బుర్రేశ్వర స్వామి ఆలయంతోపాటు పెదగుమ్ములూరు, సర్వసిద్ధి, దార్లపూడి, గెడ్డపాలెం, పెనుగొల్లు శివాలయాలకు భక్తుల తాకిడి నెలకొంది. ఆలయాలకు వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.


పాయకరావుపేటరూరల్: సీతమ్మవారి కొండపై ఉమాధర్మలింగేశ్వరస్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు

ఉపమాక ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

▸▸ టీటీడీ ఈవో శ్యామలరావుకు హోం మంత్రి అనిత వినతి


టీటీడీ ఈవో శ్యామలరావుకు వినతి పత్రం అందజేస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, నవంబరు 4: ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని హోం మంత్రి వంగలపూడి అనిత, తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో జె.శ్యామలరావును కోరారు. సోమవారం ఆమె తిరుమలలో ఈవోతోపాటు జేఈవో వీరబ్రహ్మంలను కలిశారు. ఉపమాక ఆలయంలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉపమాక ఆలయం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని ఆరోపించారు. తన నియోజకవర్గంలో వున్న ఉపమాక క్షేత్రాన్ని రానున్న ఐదేళ్లల్లో తగిన రీతిలో అభివృద్ధి చేయాలని కోరారు. ఆగమశాస్త్రం ప్రకారం ఆలయంలో చేపట్టాల్సిన నిర్మాణాలు, అభివృద్ధి పనులకు సంబంధించి ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఇటీవల హోం మంత్రికి ఇచ్చిన వినతిపత్రాన్ని ఆమె టీటీడీ ఈవో శ్యామలరావుకు అందజేశారు. కొండపైకి ఘాట్ రోడ్డు, ముఖ మండపం నిర్మాణం, కింద ఆలయంలో మూడు రాజగోపురాలు, కల్యాణ మండపం, పార్కింగ్ షెడ్డు, కేశఖండనశాల, అన్నదాన భవనం, గోశాల నిర్వహణ, నక్కపల్లి నుంచి ఉపమాక వరకు రహదారి విస్తరణ, భక్తుల కోసం విశ్రాంతి గదులు, డార్మిటరీ, మంచినీటి వసతి, పుష్కరిణి అభివృద్ధి పనులు చేపట్టాలని హోం మంత్రి కోరారు. ఉపమాక ఆలయాన్ని ఒకసారి సందర్శించి, వాస్తవ పరిస్థితులను స్వయంగా తెలుసుకోవాలని మంత్రి కోరగా, ఈవో శ్యామలరావు సానుకూలంగా స్పందించారు.

ఐదేళ్ల తర్వాత రాజకీయాలు చేద్దాం

▸▸ ఇప్పుడు ప్రజా సంక్షేమం కోసం కలిసి పనిచేద్దాం

▸▸ మండల సమావేశంలో ఎమ్మెల్యే విజయకుమార్


సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తరువాత రాజకీయాలు చేద్దాం..ఇప్పుడు ప్రజా సంక్షేమం కోసం అందరం కలిసి పనిచేద్దామని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత ఉందన్నారు. పార్టీల జెండాలు, ఎజెండాలను పక్కనపెట్టి ప్రజా అవసరాలను తీర్చడమే ఏకైక లక్ష్యంగా పనిచేయడానికి ముందుకు రావాలన్నారు. అన్ని విధాలుగా సహకరించడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. వ్యవసాయ, విద్యుత్ శాఖాధికారుల సమాధానాలపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన సేవలను అందించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు పనితీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మీరు చెబుతున్న సమాధానం బీపీ పెంచే విధంగా ఉన్నాయన్నారు. వ్యవసాయ అధికారిణి జ్యోత్స్న కుమారి మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులే ఆన్‌లైన్ ద్వారా బీమా చేసుకోవాలన్నారు. వరికి రూ.430లు చెల్లించి డిసెంబరు 31లోగా బీమా చేసుకోవాలన్నారు. ఇటీవల తుఫాన్ కారణంగా మండలంలో 12 గ్రామాల్లో 108 హెక్టార్లలో పంటకు నష్టం జరిగిందని, 671 మంది బాధిత రైతులకు రూ.27లక్షలు నష్టపరిహారం చెల్లించామన్నారు. తొలిసారిగా మండల సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మళ్ల జయమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

కార్మికుల కష్టాలు కనిపించవా?

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు సత్యనారాయణ

అచ్యుతాపురం, నవంబరు 4: తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఇరుక్కున్న కార్మికుల కష్టాలు ఇటు కంపెనీ యాజమాన్యానికి గాని అటు ప్రభుత్వానికి గాని కనిపించడం లేదా అని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. సోమవారం అభిజిత్ కర్మాగారం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ 23 రోజులుగా కర్మాగారం వద్ద కార్మికులు ఆందోళన చేస్తుంటే ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికులకు చెప్పకుండా లేఆఫ్‌ప్రకటించడమే యాజమాన్యం చేసిన తొలి తప్పు అని అన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రొంగలి రాము, సోమునాయుడు పాల్గొన్నారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

అచ్యుతాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతోందని టీడీపీ నాయకుడు దేశంశెట్టి వెంకట రమణ అన్నారు. సోమవారం దుప్పితూరులో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు సభ్యత్వ నమోదుకు ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రగడ చిన నాగేశ్వరరావు, శెట్టి తాతయ్యలు, డి.కొండలరావు, ఈశ్వరరావు, అగ్గాల రామోజీ, అనిల్ కుమార్, శేశెట్టి నానాజీ పాల్గొన్నారు.

'సర్పంచులకు తెలియకుండా ఉపాధి పనులు'

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తమ ప్రమేయం లేకుండా ఉపాధి పనులు చేపట్టడం, నిధులు మంజూరు చేస్తున్నారని పలు గ్రామాల సర్పంచులు, వైసీపీ నాయకులు సోమవారం ఎంపీడీవో సీతారామరాజుకు ఫిర్యాదు చేశారు. పంచాయతీల్లో సర్పంచుల ద్వారా తీర్మానాలు చేసి చేపట్టాల్సిన పనులను, వారికి తెలియకుండా చేయడం అధికారాన్ని హరించడమేనని వాపోయారు. తక్షణమే వీటిని అరికట్టి సర్పంచులకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ, శీరం నర్సింహమూర్తి, వైస్ ఎంపీపీ వీసం నానాజీ నేతృత్వంలో ఈ వినతిపత్రం అందజేశారు.

'అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోండి'

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదతీనార్ల మత్స్యకార గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లే అవుట్లు వేశారని, ఇందుకు కొంతమంది ప్రభుత్వ సిబ్బంది సహకరిస్తున్నారంటూ ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారం లేఅవుట్లు చేసి, అధిక రేట్లకు ప్లాట్లను విక్రయిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా అందజేశారు. తక్షణమే అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'భూ రీ సర్వే సమస్యలు పరిష్కరించాలి'


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షులు చిట్టిబాబు

పాయకరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో భూ రీసర్వే గ్రామ సభల్లో ప్రజలు అందజేస్తున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు సత్యనారాయణను చిట్టిబాబు, పార్టీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా మండలంలో భూ రీ సర్వే సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. అదేవిధంగా ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు నిర్దిష్ట సమయంలో మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథం, కంకిపాటి వెంకటేశ్వరరావు, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలు ముమ్మరం చేయాలి

పాయకరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూలు ముమ్మరం చేయాలని ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటిపన్నులు, పన్నేతర ఆదాయాల వసూలుపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో ఏఓ సీహెచ్.రవికుమార్‌వర్మ, పంచాయతీ కార్యదర్శులు వైవీ.సత్యనారాయణ, ఎల్‌ఏ.శివరామం, డి.రమేష్, కె.భీమరాజు, ఎం.మల్లికార్జునాచారి, ఎ.దుర్గాప్రసాద్, పి.అప్పలాచారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని సంపద తయారీ కేంద్రంలో వానపాములను ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి వర్మ తదిరులు విడిచిపెట్టారు.

రాష్ట్రస్థాయి వాకింగ్, రన్నింగ్ పోటీలకు ఉపాధ్యాయుడు రామారావు ఎంపిక


బహుమతి అందుకుంటున్న ఉపాధ్యాయుడు రామారావు

ఎస్.రాయవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు బొజ్జా రామారావు రాష్ట్రస్థాయి వాకింగ్, రన్నింగ్ పోటీలకు అర్హత సాధించారు. విశాఖపట్నం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో సోమవారం జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో యాభై ప్లస్ వయసుకు సంబంధించిన కేటగిరిలో రామారావు ఐదు కిలోమీటర్ల వాకింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించగా, 400 మీటర్స్ రన్నింగ్‌లో ద్వితీయ స్థానం సాధించారు. దీంతో గుంటూరు జిల్లాలో డిసెంబరు 14,15 తేదీల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు రామారావు అర్హత సాధించారు. రామారావును పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ అభినందించారు.

భూగర్భ జలాలను అమ్మేస్తున్నారు!

▸▸ ఎన్.నర్సాపురం గ్రామస్థుల ఫిర్యాదు

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.నర్సాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా హెటెరో ఔషధ పరిశ్రమకు భూగర్భ జలాలను అమ్మేస్తున్నాడంటూ సోమవారం గ్రామస్థులు, రైతులు ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తిలకు ఫిర్యాదు చేశారు. 2014లో ప్రభుత్వ సబ్సిడీపై ఇచ్చిన జలసిరి పథకం, ఉచిత విద్యుత్ పథకాన్ని వ్యవసాయానికి గాకుండా, స్వార్థంతో వ్యాపారం సాగిస్తూ హెటెరో కంపెనీకి ట్యాంకర్ల ద్వారా రోజూ నీటిని విక్రయిస్తున్నాడని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ గ్రామానికి చెందిన పల్లా చిన్నబ్బాయి నేతృత్వంలో పలువురు ఫిర్యాదులు చేశారు. వీటిపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు.

నమో.. నీలకంఠాయ..

కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు కిటకిట

వేకువజాము నుంచి స్వామి వారికి విశేష పూజలు



అనకాపల్లి కూరగాయల మార్కెట్ వద్ద శివాలయంలో పాలాభిషేకం



పరవాడ : తాడి నీలకంఠేశ్వర ఆలయంలో..





కాశీవిశ్వేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు.., సబ్బవరం మండలం మొగలిపురం గ్రామంలోని విఘ్నేశ్వర ఘాట్ వద్ద..

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు శివనామ స్మరణతో హోరెత్తాయి. వేకువజాము నాలుగు గంటల నుంచి భక్తులు బారులు తీరారు. పరమశివుడ్ని దర్శించుకుని అర్చనలు, అభిషేకాలు జరిపారు. హోమాలను నిర్వహించారు. అనకాపల్లిలోని కాశీవిశ్వేశ్వర, సిద్ధిలింగేశ్వర, ఉమా రామలింగేశ్వర, భోగలింగేశ్వర, కూరగాయల మార్కెట్ వద్ద గల శివాలయాలకు మరింతగా పోటెత్తారు. భోగలింగేశ్వరస్వామి ఆలయంలో బెస్ట్‌ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేకంగా తయారుచేసిన ప్రసాదాన్ని పంపిణీ చేశామని క్లబ్ ప్రతినిధులు పెంటకోట నరసింగరావు, పీఎస్ అప్పారావు, బీఎస్ఎంకే జోగినాయుడు, పెంటకోట ప్రభాకర్, బర్నికాన శ్రీనివాసరావు తెలిపారు.

పరవాడ : మండలంలోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. తాడి గ్రామంలో గల నీలకంఠేశ్వరస్వామిని కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి దంపతులు దర్శించుకున్నారు. అలాగే పరవాడ, లేమర్తి, భరణికం, స్వయంభూవరం, దీపాంజలినగర్, దేశపాత్రునిపాలెం శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రసాదాలను పంపిణీ చేశారు.

సబ్బవరం : మండలంలోని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. దేవీపురంలోని దక్షవటి, వంగలి, లింగాల తిరుగుడులలోని సోమలింగేశ్వరస్వామి, ఇరువాడలోని భీమలింగేశ్వరస్వామి, గొర్లివానిపాలెంలోని ఉమారామలింగేశ్వరస్వామి, పెదయాతపాలెంలోని గౌరీపరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలు, మొగలిపురంలోని విఘ్నేశ్వర ఆలయాల్లో వేకువజాము నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం నిర్వాహకులు అన్నసమారాధనను చేపట్టారు. మొగలిపురంలో వైసీపీ నేతలు గండి రవికుమార్, యడ్ల నాయుడు తదితరులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.

జాతీయస్థాయి యోగాకు గురుకుల విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సుహాసిని

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల ముంబయిలో నిర్వహించనున్న జాతీయస్థాయి యోగా పోటీలకు మండలంలోని తానాం గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈనెల రెండు, మూడు తేదీల్లో నెల్లూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కె.వెంకట వైష్ణవి రిథమిక్ విభాగంలో బంగారు పతకం, డి.హర్షిత ట్రెడిషనల్ విభాగంలో వెండి పతకం, ఎస్.ఝాన్సీలక్ష్మి ట్రెడిషనల్ విభాగంలో కాంస్య పతకంతో పాటు వ్యక్తిగత విభాగాల్లో అత్యుత్తన్నత ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు కోచ్ ఆంజనేయులు తెలిపారు. పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదరు విద్యార్థినులను ప్రిన్సిపాల్ సుహాసిని, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి క్యారమ్స్‌కు విద్యార్థులు ఎంపిక



క్యారమ్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

సబ్బవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని సారథి విద్యాలయంలో గత నెల 28న జరిగిన క్యారమ్స్ అండర్-14 విభాగం పోటీల్లో జె.కిరణ్‌కుమార్, జెనిషాల్, అండర్-17 విభాగంలో పి.రాము, ఎం.లలిత్‌కుమార్, అండర్-19 విభాగంలో జె.చిన్న అచ్చారావు, జి.కమలాకర్ ఆడి అద్భుత ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు చెప్పారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు సీఎల్ఎన్ ప్రసాద్, వి.సూర్యనారాయణ తదితరులు అభినందించారు.

80వ వార్డులో చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 80వ వార్డు కర్రివారి వీధిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. బూత్ కన్వీనర్, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి బొడ్డేడ మురళీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వార్డు టీడీపీ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు హాజరయ్యారు. సభ్యత్వ నమోదును వాట్సాప్, టెలిగ్రామ్, ఆన్‌లైన్‌లో పొందవచ్చునని సూచించారు. రెన్యూవల్ కూడా చేసుకోవచ్చునన్నారు. సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రూ.ఐదు లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని పార్టీ అధిష్ఠానం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి మల్లేశ్వరరావు, గంగాధరరావు, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

'మొబైల్ సేల్స్, సర్వీస్ ఓనర్స్ వెల్ఫేర్' కార్యవర్గం



జనసేన నాయకుడు రాంకీని సత్కరించిన కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి న్యూకాలనీలో సోమవారం మొబైల్ సేల్స్ అండ్ సర్వీస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా శిలపరశెట్టి ప్రసాద్‌బాబు, అధ్యక్షుడిగా వేగి అజయ్‌కుమార్, కార్యదర్శిగా మహ్మద్ అలీ, కోశాధికారిగా చరణ్, ఉపాధ్యక్షులుగా వి.రాజేష్, పి.గోపి, సహాయ కార్యదర్శులుగా ఎన్.పవన్‌రాజ్, జె.సంతోష్‌లతో పాటు పలువుర్ని సభ్యులుగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన అనకాపల్లి జనసేన ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ కమిటీ సభ్యులను అభినందించారు. అసోసియేషన్ ప్రతినిధులు డి.వెంకట సతీష్, కె.వెంకట శివాజీ, రామకృష్ణారావు, మధుబాబు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

'పార్శిల్ కౌంటర్‌ను పునరుద్ధరించాలి'



ఏఎస్ఎంకు వినతిపత్రం అందిస్తున్న వైసీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రైల్వేస్టేషన్‌లో పార్శిల్ బుకింగ్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ నాయకులు ఏఎస్ఎం రామకృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం స్టేషన్ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో పార్శిల్ బుకింగ్ కౌంటర్‌ను మూసివేయడం తగదన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, మందపాటి జానకిరామరాజు, మలసాల కిశోర్, కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

పది మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి స్వగ్రామానికి తీసుకువెళ్తున్న వ్యక్తి నుంచి సోమవారం పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. శంకరం గ్రామానికి చెందిన తోట సన్యాసిరావు ఇక్కడి రింగురోడ్డు సమీపంలో మద్యం బాటిళ్లు కొనుగోలు చేశాడన్నారు. స్వగ్రామానికి తీసుకువెళ్తుతుండగా, సుంకరమెట్ట జంక్షన్ వద్ద అనుమానం వచ్చి తనిఖీ చేసి, బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

సచివాలయాలు, అన్న క్యాంటీన్ల తనిఖీ

సిబ్బందికి జోనల్ కమిషనర్ రమణ సూచనలు



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రమణ

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ రమణ సోమవారం పట్టణంలోని సచివాలయాలు, అన్న క్యాంటీన్లను తనిఖీ చేశారు. తొలుత మూడు, నాలుగు, ఆరు, తొమ్మిది, పది సచివాలయాలకు వెళ్లి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని, రికార్డులు పక్కా నిర్వహించాలని సూచించారు. అనంతరం భీమునిగుమ్మంలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అక్కడ పేద ప్రజలకు అందిస్తున్న భోజనాలు ఏ విధంగా ఉన్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భోజనం చేస్తున్న వారిని కూడా ఎలా ఉందంటూ ప్రశ్నించడంతో వారు బాగుందని సమాధానం ఇచ్చారు. అలాగే ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలపై సచివాలయ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏపీడీ వై.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా పోరు'ను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరణలో సీపీఎం నాయకుడు లోకనాథం తదితరులు

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న ప్రజాపోరు కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల ఎనిమిదో తేదీ నుంచి పద్నాలుగో తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలపై ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. 14వ తేదీన సచివాలయాల వద్ద, 15న మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నామన్నారు. నిత్యావసర వస్తువులు, వంట నూనెలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో ప్రజలంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరకులను సరసమైన ధరలకు అందించాలని కోరారు. అలాగే, విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన పాల సేకరణ ధరను తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంటా శ్రీరామ్, ఎం.అప్పలరాజు, జి.కోటేశ్వరరావు, డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'వాసవీ గవర్నర్ పదవికి ఎన్నికలు జరపాలి'



విలేకరులతో మాట్లాడుతున్న వెంకట మాధవ్

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ పదవికి ఎన్నికలు నిర్వహించాలని క్లబ్ వైస్ గవర్నర్ శ్రీనాథ వెంకటమాధవ్ కోరారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తనతో పాటు పసుమర్తి మల్లికార్జునరావు, కె.సోమరాజు, కె.పార్వతి నామినేషన్ వేయడం జరిగిందన్నారు. అయితే సోమరాజు నామినేషన్‌ను ఉపసంహరించుకోగా మూడు నామినేషన్లను స్క్రూట్నీలో పరిశీలించిన ఎన్నికల అధికారి శ్రీనాథ శ్రీను ఓకే చేసి హైదరాబాద్ క్లబ్‌కు పంపారన్నారు. తనతో పాటు మల్లికార్జునరావు నామినేషన్‌ను తొలగిస్తూ కె.పార్వతి అలియాస్ పూర్ణిమాను క్లబ్ గవర్నర్‌గా నిర్ణయించి లేఖ రాశారన్నారు. ఇది చెల్లదని అందువల్ల గవర్నర్ పదవికి ఎన్నిక జరిపించాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో క్లబ్ జోన్ చైర్మన్ టి.సుబ్రహ్మణ్యం, ఎన్.ప్రసాద్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఏసీపీ బదిలీ

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏసీపీ రామకృష్ణకు బదిలీ అయింది. ఇతనిని భీమిలికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందినట్టు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ స్థానంలో గాజువాక ఏసీపీగా పనిచేస్తున్న వెంకటరావును ఇన్‌చార్జిగా నియమించారు. గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న టీపీవో పోస్టును కూడా భర్తీ చేశారు. విశాఖ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కనకారావును అనకాపల్లి టీపీవోగా నియమించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు కాపీని అందిస్తున్న నాయకులు

కొత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 80వ వార్డు శివారున ఉన్న ముదిరాజ్ కాలనీలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం చురుగ్గా సాగింది. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పొలమరశెట్టి నాగేశ్వరరావు స్థానికులకు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రధాని నరేంద్రమోదీ దేశాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. సభ్యత్వ నమోదు చేసుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఉడా రమేష్, చదరం సూరిఅప్పారావు, వి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి వంట పాత్రలు వితరణ

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాంకీ ఫౌండేషన్ సామాజిక బాధ్యతలో భాగంగా పరవాడ ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతిగృహానికి ఐదు ఐరన్ సెల్ఫ్‌లు, వంటపాత్రలు, స్టౌ, గ్రైండర్లు సమకూర్చింది. వీటిని విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ డీజీఎం గిరిధర భక్తి చేతుల మీదుగా సోమవారం వసతి గృహానికి అందజేశారు. రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, వసతి గృహం మెట్రిన్ సుజాత, ఫౌండేషన్ సిబ్బంది శ్రీనివాస్, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా గణిత వారోత్సవాలు

విజేతలకు బహుతులు ప్రదానం చేసిన అతిథులు



బహుమతులు పొందిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కశింకోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెదురుపర్తి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న గణిత వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులను ప్రదానం చేశారు. మానవ గణనయంత్రం బిరుదు పొందిన శకుంతలా దేవి జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వారోత్సవాల్లో విద్యార్థులకు గణిత భావనలను, నమూనాలను వివరించామని ప్రధానోపాధ్యాయుడు జీవీకే ఆచారి తెలిపారు. ఒత్తిడి లేకుండా గణితం బోధించడం వల్ల విద్యార్థుల్లో భయం పోయి ఆసక్తి పెరుగుతుందన్నారు. ఈ వారం రోజులు బోధనపై క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్, ఆటలు, పాటలు, నాటికల ద్వారా గణిత బోధనపై పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు ఏవీఎన్ మూర్తి, ఉపాధ్యాయులు వై.విజయ్, సోమరాజు, సబితలక్ష్మి, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

వరిలో చీడపీడల నివారణపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సీతానగరంలో గల వరి పొలాలను వ్యవసాయ శాఖకు చెందిన సిబ్బంది సోమవారం పరిశీలించారు. ఈ పొలాల్లో చీడపీడల గుడ్లను, లార్వాను నాశనం చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు జ్యోతిమోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. రైతులు సాగుచేసే పంట పొలాలకు నష్టం కలగకుండా ఉండాలంటే ఎకరాకు 20వేల ట్రైకోగ్రామా గుడ్లను వదిలిపెట్టాలన్నారు. అంతేకాకుండా వరిలో కొడతెగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉన్నందున ప్రోపీ కొనజోల్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల తెగుళ్ల నుంచి వరి పొలాలను రక్షించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

శివాలయం పునర్నిర్మాణానికి విరాళం



కమిటీ పెద్దలకు విరాళం అందిస్తున్న పైడింనాయుడు

సబ్బవరం, నవంబరు 4 : మండల కేంద్రం సబ్బవరంలో పురాతన శివాలయం స్థానంలో కొత్తగా పునర్నిర్మిస్తున్న ఆలయానికి శివరంజనీ ప్రింటర్స్ అధినేత సబ్బవరపు పైడింనాయుడు దంపతులు సోమవారం రూ. 50,116, మరో స్థానికులు మైచర్ల అప్పలరాజు రూ.10,116 విరాళం అందజేశారు. విరాళ దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నానిబాబు, గెద్దం కృష్ణ, రమణ, బర్ల రమణ, కొల్లి కృష్ణ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

'ముదిరాజ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి'



సమావేశంలో సమస్యపై చర్చిస్తున్న నాయకుడుల

తుమ్మపాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి గుడాల సత్యనారాయణ కోరారు. అనకాపల్లిలో సోమవారం జరిగిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ముదిరాజ్ నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ముదిరాజ్‌లు 16.5 లక్షల జనాభా ఉంటే కనీస రాజకీయ ప్రాధాన్యం ఇవ్వకపోతే ఎలా అని ప్రశించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక సంస్థల నామినేటెడ్ పదవుల కేటాయింపులో ముదిరాజ్‌లకు అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ముదిరాజ్ మహాసభ నాయకులు కనికెళ్ళ బాలాజీ, ములుగు నాగేశ్వరరావు, సూరంపూడి రఘు, చింత హరినాథ్, అనపర్తి శంకర్రావు, ములుగు నరసింహారావు, నడుపూరి అనిల్, గుడాల సూర్య ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : శెట్టి బలిజ, గౌడ, యాత, ఈడిగ సామాజికవర్గాల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా స్కాలర్‌షిప్‌లను అందజేయనున్నట్టు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఇ.వి.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌తో పాటు ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 90328 42266 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు 'గ్లోబల్' విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నరసారావుపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఈత పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన ఈత పోటీల్లో పాఠశాలకు చెందిన జి.ధార్మిక, ఐ.వైష్ణవి, బి.లాస్యవర్షిత, స్మృతిరాణి, జి.రోషిణి, ఆర్.తేజ, జి. తరుణ్, జె. జయదీప్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి. మధుబాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్. సీతాలక్ష్మి, సీఈవో కె. నిశాంత్ అభినందించారు.

గుంతల పూడ్చివేతకు వంద రోజులు ప్రణాళిక

జీవీఎంసీ పరిధిలోని రోడ్లపై 4,441 గుంతలు గుర్తింపు

తొలిదశలో రూ.6.83 కోట్లతో 2009 గుంతలు పూడ్చివేత పనులు ప్రారంభం

విశాఖపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో గుంతలు లేని రోడ్లు లక్ష్యంగా జీవీఎంసీ వంద రోజులు ప్రణాళికను అమలుచేస్తోంది. ఇందుకు సంబంధించిన పనులకు కమిషనర్ పి.సంపత్‌కుమార్ శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ పరిధిలోని జాతీయ రహదారితోపాటు ఇతర ప్రధాన మార్గాల్లో 4,441 గుంతలు ఉన్నట్టు ఇంజనీరింగ్ అధికారులు గుర్తించారు. తొలిదశలో 2009 గుంతలు పూడ్చివేత పనులు రూ.6.83 కోట్లతో ప్రారంభించారు. మిగిలిన గుంతలు పూడ్చివేతకు మరోసారి టెండర్లు పిలవనున్నారు. రెండు నెలల్లో నగర పరిధిలోని రోడ్లపై ఏర్పడిన గుంతలన్నింటినీ పూడ్చివేయనున్నట్టు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్వహణను పట్టించుకోకపోవడంతో గుంతలమయంగా తయారయ్యాయి. గుంతల రోడ్లపై వాహనాలను నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. అయినా వైసీపీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుంతల్లేని రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈనెల రెండున రాష్ట్రవ్యాప్తంగా గుంతలు పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరంలో కూడా జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో మొదటి యూనిట్ మరమ్మతులు పూర్తి

సీలేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సీలేరు జలవిద్యుత్ కేంద్రంలోని మొదటి యూనిట్‌ను సోమవారం రాత్రి మెకానికల్ స్పిన్నింగ్‌లో పెట్టినట్టు జెన్‌కో ఈఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు. జలవిద్యుత్ కేంద్రంలో 60 మెగా వాట్ల సామర్థ్యం గల మొదటి యూనిట్ ఈఏడాది ఆగస్టు 2న సాంకేతిక లోపాలు తలెత్తి విద్యుదుత్పత్తి నిలిచిపోయింది.ఈ యూనిట్‌లో మరమ్మతు పనులు సోమవారం సాయంత్రానికి పూర్తి కావడంతో రాత్రి మెకానికల్ స్పిన్నింగ్‌లో పెట్టారు. మంగళవారం ఉదయం వరకు యూనిట్‌ను మెకానికల్ స్పిన్నింగ్‌లో ఉంచి, టెంపరేచర్, మెగ్గర్ వ్యాల్యూస్ సక్రమంగా ఉంటే మంగళ వారం సింకర్‌నైజింగ్ చేసి యూనిట్‌ను వినియోగంలోకి తీసుకురానున్నామని ఈఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్సు ఎస్ఈ రామభద్రరాజు, ఈఈ బాలకృష్ణ, తదితర్లు పాల్గొన్నారు.

సీలేరులో సినిమా షూటింగ్ సందడి

▸▸ అమ్మవారి ఆలయంలో పూజలు



మారెమ్మ ఆలయంలో షూటింగ్ చేస్తున్న దృశ్యం

సీలేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో సోమవా రం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. స్థానిక మారెమ్మ ఆలయంలో సినిమా స్క్రిప్ట్‌ను అమ్మవారి వద్ద పెట్టి షూటింగ్ విజయవంతంగా ముగిసి, సినిమా విజయవంతం కావాలని పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిపై తొలి షాట్‌ను చిత్రీకరించారు. ఈ సందర్భంగా సినిమా డైరెక్టర్ మల్ల వంశీకృష్ణ మాట్లాడుతూ ఏవైకా హోమ్స్ ప్రైవేటు లిమిటెడ్ నిర్మిస్తున్న కొత్త చిత్రం మదం అని పేరు పెట్టినట్టు తెలిపారు. ఈ సినిమా ఎమోషనల్ రివెంజ్ డ్రామా అని తెలిపారు. సినిమాలో హర్ష గంగవరపు, అనురూప్ కటారి, లతా, విశ్వనాథ్ రెడ్డి కథానాయకుడు, నాయికలుగా నటిస్తున్నట్లు తెలి పారు. ఈ చిత్రమంతా సీలేరు బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతుందన్నారు. కార్యక్ర మంలో కెమెరామెన్ రవికుమార్, ఎడిటర్ నందమూరి తారకరామారావు, సీఈఓ శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి మంత్రికి వినతుల వెల్లువ



సమస్యలపై మంత్రి సంధ్యారాణికి వివరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

పాడేరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాడేరు పర్యటనకు వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి మన్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. వివిధ ప్రజా, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు వినతులు అందించారు. వీఆర్ఏలకు పేస్కేల్ జీతాల చెల్లింపు, వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా నాయకులు శేఖర్ తదితరులు వినతిపత్రం అందించారు. జీవో నంబరు 3కు చట్టబద్ధతపై అసెంబ్లీలో చట్టం చేయాలని, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని గిరిజన సంఘం నాయ కులు కిల్లో సురేంద్ర, ఎస్.దర్మన్నపడాల్, పి.బాలదేవ్ తదితరులు వినతి పత్రం అందించారు. జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర మంత్రిని కలిసి గిరిజన ప్రాంతంలో ప్రత్యేక జీవోను తీసుకొచ్చి ఆదివాసీ ప్రాంత స్పెషల్ డీఎస్సీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మన్యంలో నెలకొన్న ప్రతీ సమ స్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారా నికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందిస్తున్న జోగులు, తదితరులు

అనంతగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యరాణికి టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మోస్య జోగులు విన్నవించారు. పాడేరు పర్యటించిన మంత్రిని కలిసి మండలంలోని పలు సమ స్యలను వివరించారు. అలాగే రేగం నుంచి పాత కోట మీదుగా పెదబయల్ రింగురోడ్డు పూర్తిచేయాలని, ప్రభుత్వం మారినా పలువురు అధికారులు తీరు మారలేదని వినతిలో పేర్కొన్నారు.


పశుగణన వివరాల నమోదుకు సహకరించాలి



కాశీపట్నంలోని పశు సంపద వివరాలను నమోదు సిబ్బంది

అనంతగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో జరుగుతున్న 21వ పశుగణన విరాలను నమోదు కార్యక్రమాన్ని పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు సోమవారం పరిశీలించా రు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల ఆదేశాల మేరకు మండలం వ్యాప్తంగా 293 గ్రామాలలో 12,941 కుటుంబాల, పశుసంపద వివరాలను నమోదు చేస్తున్నామని చెప్పారు. దీనికి రైతులు పూర్తిగా సహకరించాలని కోరారు. పశుగణన వివరాలను నమోదు చేసేందుకు 2 1మంది సిబ్బందిని నియమించామన్నారు. పశు సంపద వివరాలను సిబ్బందికి ఇచ్చి సర్వేకు సహకరించాలన్నారు

ముంచంగిపుట్టు ఎస్ఐగా రామక్రిష్ణ బాధ్యతలు



ముంచంగిపుట్టు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు ఎస్ఐగా జె.రామక్రిష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న కె.రవీంద్ర సీలేరు పోలీస్ స్టేషన్‌కు బది లీపై వెళ్లగా, అక్కడి నుంచి రామక్రిష్ణను జిల్లా పోలీస్ అధికారులు ఇక్కడకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ దొంగ తనాలు జరగకుండా ప్రత్యేక దృష్టిసారిస్తామని, పోలీసులకు ప్రజలు సహ కారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

గిరి యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలి

▸▸ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి.

పాడేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన యువత ఉన్నతంగా చదువుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, గిరిజన సంక్షేమం, మహిళ, శిశు సంక్షేమ శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి పిలుపు నిచ్చారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో సోమవారం నిర్వహించిన 'కిశోర వికాసం' కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు, యువ త గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. గురువులు, తల్లిదండ్రులు చెప్పిన మాటలు విని మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. బాల్య వివాహాలను వ్యతిరేకించాలని, పౌష్టికాహారం తీసు కుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. గిరిజన విద్యార్థులకు త్వరలోనే కాస్మోటిక్స్ అందజేస్తామన్నారు. అలాగే గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన ఉండాలని, ఆడ పిల్లలను మాత్రమే కాదని, మగ పిల్లలను సైతం సంస్కారవంతంగా పెంచాలని ఆమె సూచించారు. గిరిజన విద్యార్థులు బాగా చదువుకుని జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు కావాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం బాలి కల కోసం అత్యవసర నంబర్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, రంపచోడవరం ఎమ్మెల్యే ఎం.శిరీషాదేవి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, అరకులోయ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర, బీజేపీ నేతలు పాంగి రాజారావు, కూడ కృష్ణారావు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి సంధ్యారాణికి ఘన స్వాగతం



మంత్రి సంధ్యారాణికి స్వాగతం పలుకుతున్న కూటమి నేతలు



అల్లూరి విగ్రహాన్ని జ్ఞాపికగా అందిస్తున్న కలెక్టర్

పాడేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తొలిసారిగా సోమవారం ఇక్కడికి విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గిరి జన, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి గుమ్మడి సంధ్యా రాణికి అధికారులు, కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలి కారు. విశాఖపట్నం నుంచి పాడేరు వస్తున్న ఆమెకు ఘాట్ లోని అమ్మవారి పాదాలు, బంగా రుమెట్ట గ్రామం వద్ద జిల్లా కలె క్టర్ దినేశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్, మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, జనసేన నియోజకవర్గ ఇన్ చార్జి వంపూరు గంగులయ్య, బీజేపీ నేతలు పాంగి రాజారావు, కురసా ఉమామహేశ్వరరావు, తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలి కారు. అనంతరం ఆమె ఘాట్‌లోని అమ్మవారి పాదాలుకు ప్రత్యేక పూజ నిర్వ హించారు. ఈకార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంధ్యారాణిని సత్కరించిన కలెక్టర్

జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణిని సోమవారం జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఘనంగా సత్కరించారు. అన్ని కార్యక్రమాలు ముగిసిన అనంతరం కలెక్టర్ మంత్రి సంధ్యారాణికి తొలుతగా అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని బహూకరించారు. తర్వాత శాలువా కప్పి గిరిజన సంప్రదాయం జ్ఞాపికను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అమిత్‌బ ర్దార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్, డీఆర్‌వో బి.పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

శివాలయాలకు కార్తీక శోభ



భక్తులతో కిటకిటలాడిన పాడేరు ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం



కొయ్యూరు మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు

పాడేరురూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమ వారం మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. పురా తన శైవక్షేత్రం ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంతోపాటు పాత పాడేరులోని స్వయంభూ గౌరీ నీలకంఠేశ్వరుని ఆలయం, త్రిముఖ లింగేశ్వర ఆలయాలు సోమవారం వేకువజాము 5 గంటల నుంచే భక్తులతో కిటకిటలాడాయి. ఉమానీలకంఠేశ్వరుని ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల రామం పంతులు శివునికి ప్రత్యేక అర్చనలు, పూజలు చేశారు. భక్తులకు ఆలయ ధర్మ కర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సేవాసంఘం ప్రతినిధులు ప్రసాదం, తాగునీటి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుల్లి రామారావు, రాజబాబు, బాబూరావు, కొండలరావు, ముకుందరావు, వెంకటరత్నం పాల్గొన్నారు.

కొయ్యూరులో.. కార్తీకమాసం మొదటి సోమవారం పురస్కరించి మండ లంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కొయ్యూరులో భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయం, వలసంపేట గిరిజా సమేత తాండవేశ్వర స్వామి ఆలయం, పి మాకవరంలో శివాలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో ఆయా ప్రాంతాలు శివనామ స్మరణతో మారుమోగాయి. కొయ్యూరు మల్లికార్జు నస్వామి ఆలయం వద్ద ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంవీవీ ప్రసాద్ కొయ్యూరుకు చెందిన అనిశెట్టి చిరంజీవి ఆర్థిక సాయంతో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అలాగే వలసంపేట, పి. మాకవరం ఆలయాల వద్ద కమిటీ పెద్దలు పులిహోర, వాటర్ ప్యాకెట్లు సరఫరా చేశారు. మండలంలోని శైవ క్షేత్రాల వద్ద సోమవారం భక్తుల తాకిడితో కార్తీక శోభ ఉట్టి పడింది.

మత్స్యగుండంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

హుకుంపేట: మఠం పంచాయతీ కేంద్రంలోని మత్స్యగుండం వద్ద ప్రత్యేక పుణ్యక్షేత్రంలో కార్తిక మాసం సందర్భంగా భక్తులు ప్రత్యేకంగా పూజలు చేశారు. తొలి సోమవారం గంగ స్నానాలు చసి మత్స్యలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఆరోగ్యంగా ఉండాలంటే ఒత్తిడికి దూరం కావాలి

▸▸ ఎంపీడీవో ఏవీవీ.కుమార్



ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి దూరంగా ఉంటేనే ఉద్యోగులు, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండగలరని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం హైదరబాద్ నిజామ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలోని ఉద్యోగులకు, ప్రజలకు ఒక రోజు ఫిజియోథెరపి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నిపుణులు ద్వారా రోజువారీ పొరపాట్లు, ఆహారపు అలవాట్లు, ఒత్తిడికి లోనవ్వడం వంటి తదితర అంశాలపై క్షుణంగా వివరించారు. దానిని ఎలా జయించానేది కూడా అవగాహన కల్పించారు. ఆరో గ్యమే మహాభాగ్యం నినాదంతో ప్రతీ ఒక్కరు ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఎంపీడీవో ఏవీవీ.కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోని ఉద్యోగులు, ప్రజలకు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

రాంబిల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతంగా చేపట్టాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవ ర్గంలో టీడీపీ ఎంతో బలంగా ఉందని, 50 వేలు సభ్యత్వం చేసేం దుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వార్డుకు 300 వరకు సభ్య త్వాలు చేయాలని సూచించారు. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ లాలం భవాని మాట్లాడుతూ మండలంలో టీడీపీకి పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు పార్టీశ్రేణులు ఐక్యతగా ఉండి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు రవిరాజు, సీనియర్ నాయకులు రవిరాజు, టీడీపీ మండల తెలుగుయువత అధ్యక్షులు ఎరిపిల్లి అజయ్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : శెట్టి బలిజ, గౌడ, యాత, ఈడిగ సామాజికవర్గాల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థు లకు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా స్కాలర్‌షిప్‌లను అందజే యనున్నట్టు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఇ.వి.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌తో పాటు ఉన్నత విద్య నభ్యసిస్తున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చనన్నారు. ఈ అవకా శాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 90328 42266 నంబరును సంప్రదించాలని కోరారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

▸▸ ఎంపీడీవో శ్రీసాయిహర్ష



ఉపాధ్యాయుల శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీసాయిహర్ష

ముంచంగిపుట్టు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో వెనుకబడిన విద్యా ర్థులను గుర్తించి, వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధవహించాలని ఎంపీడీవో ఎం.శ్రీసాయిహర్షం సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న టీచింగ్ అట్ రైట్ లెవెల్ శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, తెలుగు బాషలో విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడాలని సూచించారు. గణితంలో సంఖ్యా భావనతో పాటు చతుర్విధ ప్రక్రియలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. ఉపాధ్యాయులు బోధన నైపుణ్యా లను మెరుగుపర్చుకొని, విద్యార్థులకు ఉపయోగకరంగా బోధనలు చేయాలన్నారు. మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.క్రిష్ణమూర్తి, డీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతపల్లి సీఐ వినోద్‌బాబు బాధ్యతల స్వీకారం



చింతపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.వినోద్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరిం చారు. తాజా బదిలీల్లో రెండేళ్లపాటు ఇక్కడ పనిచేసిన సీఐ కె.రమేశ్‌ను విశాఖపట్నం బదిలీ చేయగా ఆయన స్థానంలో అనకాపల్లి నుంచి వినోద్‌బాబు ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌కి ప్రాధాన్యం ఇస్తామని, ప్రజలు ఏ సమయంలోనైనా పోలీసు స్టేషన్‌కి వచ్చి సమస్యను పరిష్కరించుకోవచ్చునన్నారు.

రైతులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

గూడెంకొత్తవీధి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలకు రైతులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన స్థా నిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చెక్కలమద్ది, గుమ్మిరేవుల చెరువు పరిధిలో నీటి సంఘాల ఎన్నికలు నిర్వ హించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నీటి సంఘం ఎన్నిక ల్లో పాల్గొనే రైతుల వివరాలకు కూడిన ఓటరు జాబితా స్థానిక వీఆర్వోల వద్ద ఉందన్నారు. రైతులు ఓటరు జాబితాను పరిశీలిం చుకుని ఓటు హక్కు లేకపోతే తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్ఐ రామకృష్ణకు ఘనంగా సన్మానం



ఎస్ఐ రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

సీలేరు, నవంబరు 4: జీకేవీధి మండలం సీలేరు పోలీస్ స్టేష న్‌లో సోమవారం బదిలీపై వెళుతున్న ఎస్ఐ రామకృష్ణకు పోలీస్ సిబ్బంది, స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన సీఆర్‌పీఎఫ్ జీ 42 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వికాష్‌పాండే మాట్లాడుతూ సీలేరు ఎస్ఐ జె.రామకృష్ణ సివిల్ పోలీస్‌లు, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో ఎటువంటి వివక్ష లేకుండా ఐక్యతతో మెలిగారన్నారు. బదిలీపై వెళుతున్న ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ తాను ఎస్‌హెచ్‌ఓగా తొలుత సీలేరులోనే విధులు చేపట్టానని, సీలేరు ప్రజలు ఎంతో సహకరించారన్నారు. అందిరి సహకారంతో ఎటువంటి రిమా ర్కులు లేకుండా ఇక్కడ నుంచి వెళుతున్నానన్నారు. కార్యక్ర మంలో నూతన ఎస్ఐ కె.రవీంద్ర, పీహెచ్‌సీ డాక్టర్లు ఎస్‌కే మస్తాన్‌వల్లీ, కె. సౌమ్య, ఆరోగ్య విస్తరణాధికారి కె.జోజిబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు వినికిడి పరికరాల నమోదుకు శిబిరం

పాడేరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఈనెల 6వ తేదీన వినికిడి పరిక రాల కోసం నమోదు చేసేందుకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహి స్తున్నామని డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా తెలిపారు. దీన్ దయాల్ శ్రావణ్ ఫౌండేషన్, జాతీయ ఆరోగ్య మిషన్, ఆర్‌బీఎ స్‌కే ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శిబి రానికి వచ్చేవారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, రెండు పాస్ ఫొ టోలు, ప్రభుత్వం జారీ చేసిన ప్యూర్ టోన్ ఆడియో మెట్రీ రిపోర్టు, సదరం ధ్రువపత్రం, ఈఎన్‌టీ వైద్యులు రాసిన మందుల చీటి తీసుకురావాలన్నారు.

'వృద్ధులను గౌరవించడం అందరి బాధ్యత'



సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్.కుమార్

పాడేరురూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధు లను గౌరవించడం సమాజంలో ప్రతీ ఒక్కరి బాధ్యత అని గ్రామ వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పీఎస్.కుమార్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా సోమవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశమంది రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వృద్ధులను భారంగా భావించకుండా వారి అనుభవాలను, జ్ఞానాన్ని ప్రస్తుత తరం వారు నేర్చుకోవాలన్నారు. వృద్ధుల సంరక్షణ పట్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. వారికి మంచి ఆహారం, దుస్తులతో పాటు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జె.మాధవి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్.కె.కృష్ణారావు, ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్.రమేష్, సీనియర్ సిటిజన్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగభూషణం పాల్గొన్నారు.

6న ప్రత్యేక వైద్య శిబిరం

పెదబయలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఈ నెల 6వ తేదీన ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తామని వైద్యాధికారి డాక్టర్ జి.నిఖిల్ తెలిపారు. కంటి సమస్యలతో బాధ పడే వారు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి హాజరైన వారికి ఉచిత వసతి, భోజన, రవాణా సదుపాయాలు కల్పించనున్నట్టు చెప్పారు. అలాగే శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఉచితంగా చేయిస్తామన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు, బ్యాంకు పాస్ పుస్తకం తీసుకురావాలని సూచించారు.

పది మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి స్వగ్రామానికి తీసుకువెళ్తున్న వ్యక్తి నుంచి సోమవారం పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసు కున్నామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. శంకరం గ్రామానికి చెందిన తోట సన్యాసిరావు ఇక్కడి రింగురోడ్డు సమీపంలో మద్యం బాటిళ్లు కొనుగోలు చేశాడన్నారు. స్వగ్రామానికి తీసుకు వెళ్తుండగా, సుంకరమెట్ట జంక్షన్ వద్ద అనుమానం వచ్చి త నిఖీ చేసి, బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇంటి పన్నుల వసూలు ముమ్మరం చేయాలి

పాయకరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూలు ముమ్మరం చే యాలని ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవా రం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయ తీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటిపన్నులు, పన్నేతర ఆదాయాల వసూలుపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో ఏఓ సీహెచ్.రవికు మార్‌వర్మ, పంచాయతీ కార్యదర్శులు వైవీ.సత్యనారాయణ, ఎల్‌ఏ.శివరామం, డి.రమేష్, కె.భీమరాజు, ఎం.మల్లికార్జునాచారి, ఎ.దుర్గాప్రసాద్, పి.అప్పలాచారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక సమావేశం

ఎస్.రాయవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిష త్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఎంపీపీ కోన లోవ లక్ష్మి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో అ భివృద్ధి పనులపై చర్చించి, వాటిని తీర్మానించారు. ఎంపీటీసీ సభ్యులకు నిధులు విడుదల, మండల పరిషత్ కార్యాలయ నిర్వహణ ఖర్చులపై కూడా తీర్మానించారు.

ఆలయాలకు కార్తీక శోభ

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు.. శివనామస్మరణతో మార్మోగిన ప్రాంగణాలు



భక్తులతో కిక్కిరిసిపోయిన రావికమతం శివాలయం

చోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆలయాలకు కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక మాసం ప్రారంభం రోజైన సోమవారం భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వయంభూ గౌరీశ్వరాలయం వద్ద సోమవారం రాత్రి నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం: కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో వేకువ జాము నుంచే ఆలయాలు కిటకిటలాడాయి. మండలంలోని రావికమతం, కొత్తకోట, మేడివాడ, కవ్వగుంట గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు పూజలు, అభిషేకాలు చేయించుకున్నారు. అలాగే ధ్వజ స్తంభాల వద్ద దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రావికమతం శివ పంచాయతన ఆలయంలో రాచకొండ ఆంజనేయమూర్తి ఆధ్వర్యంలో హోమం చేశారు.

మాడుగులలో...

మాడుగుల/మాడుగుల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శివనామాన్ని జపిస్తూ తన్మయం పొందారు. వీరవిల్లి అగ్రహారం, ఎం.కోడూరు, జంపెన, కేజే.పురం, జాలంపల్లి గ్రామాలతో పాటు మాడుగులలోని భీమలింగేశ్వర, ఉబ్బలింగేశ్వర, స్వర్ణ లింగేశ్వర, కృష్ణభూపాలేశ్వర ఆలయాల్లో భక్తుల తాకిడి నెలకొంది.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని తిమిరాం, దేవరాపల్లి, పెదనందిపల్లి, చిననందిపల్లి, బి.కింతాడ, తెనుగుపూడి గ్రామాల్లో ఆలయాలు సోమవారం వేకువ జాము నుంచి భక్తులతో రద్దీగా కనిపించాయి. తెనుగుపూడి, తిమిరాం, బి.కింతాడ శివాలయాలు శారదా నది ఒడ్డున ఉండడంతో భక్తులు నదీ స్నానం ఆచరించి పూజలు నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, మాజీ సీఎంపీఆర్వో పూడి శ్రీహరి తదితరులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తిమిరాం ఆలయంలో పురోహితులు పాకల కామేశ్వరరావు శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



దేవరాపల్లి మండలం తిమిరాం శివాయంలో పూజలు చేస్తున్న భక్తులు

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: ఏఎల్.పురం స్వయంభూ రాజరాజేశ్వరి నీలకంఠేశ్వరస్వామి ఆలయం భక్తులతో కళకళలాడింది. కార్తీక సోమవారం కావడంతో ఏఎల్.పురం, చోద్యం, నాగాపురం, కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట గ్రామాల్లో భక్తులు బోడ్డేరు గెడ్డలో స్నానాలు చేసి నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ ఆధ్వర్యంలో



చోడవరం స్వయంభూ గౌరీశ్వరాలయం వద్ద బారులు తీరిన భక్తులు... పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాజు

సుమారు 200 మంది మాలధారణ చేసిన అయ్యప్ప, శివస్వాములకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత లగుడు రమేశ్, హైస్కూల్ పేరెంట్ కమిటీ చైర్మన్ బొడ్డు జమీలు, ఆలయకమిటీ సభ్యులు, పూజారులు పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం: మండలంలో ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. జిల్లేడిపూడి శివలింగం వద్ద భక్తులు అభిషేకాలు నిర్వహించారు ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే చమ్మచింత ఉత్తరవాహిణి దగ్గర భక్తులు తాండవ నదిలో పుణ్య స్నానాలు చేసి కాశీ అన్నపూర్ణేశ్వరి ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వీరభూపతి అగ్రహారం రామాలింగేశ్వర ఆలయం వద్ద భక్తులు చాంతాడంత క్యూలో నిరీక్షించి మరీ స్వామివారిని దర్శించుకున్నారు.

చీడికాడలో...

చీడికాడ: మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎల్‌బీ.పట్నం, ఖండివరం, చీడికాడ, తురువోలు గ్రామాల్లో వేకువ జాము నుంచి భక్తులు బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మిగతా గ్రామాల్లోనూ శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.



మాడుగుల: వీరవిల్లి అగ్రహారం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



విలేకరులతో మాట్లాడుతున్న సూర్యచంద్ర, పక్కన నాయకులు

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న మాజీ ఎమ్మెల్యే

▸▸ జనసేన నాయకుడు సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుకపై మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని నర్సీపట్నం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త రాజాన వీర సూర్యచంద్ర ఆరోపించారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పలు అభివృద్ధి పనులకు, పేద ప్రజలకు గబ్బాడ ఇసుక ర్యాంపులో ఉచితంగా ఇసుక పంపిణీ జరుగుతందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గబ్బాడ ఇసుక ర్యాంపులో భారీ దోపిడీ జరిగిందని, దీనిపై విచారణ చేపట్టి రూ.18 కోట్ల పెనాలిటీ వేయడం జరిగిందని చెప్పారు. ఈ విషయాన్ని పక్కదారి పట్టించేందుకు మాజీ ఎమ్మెల్యే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ నాయకులపై అక్రమ కేసులు బనాయించారని ఈ నెల 6న నర్సీపట్నం రూరల్ సీఐ కార్యాలయం వద్ద ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. గతంలో మునిసిపాలిటీలో డీజిల్ కొనుగోళ్లలో అవినీతి జరిగిందని కౌన్సిల్ సమావేశంలో జనసేన కౌన్సిలర్ సౌజన్య ప్రశ్నిస్తే కౌన్సిలర్‌తో పాటు పార్టీ అధ్యక్షుడు గణేశ్‌పై తప్పుడు కేసులు బనాయించలేదా అని ప్రశ్నించారు. సమావేశంలో జనసేన అధ్యక్షుడు గణేశ్, నాయకులు కె.కల్యాణ్, మారిశెట్టి రాజా పాల్గొన్నారు.

కొమిరలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు



ఉత్సవాలకు అంకురార్పణగా వరి దుబ్బు తీసుకువస్తున్న భక్తులు

రావికమతం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమిర గ్రామంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలకు సోమవారం రాత్రి అంకురార్పణ చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, రైతులు, పెద్దలు, భక్తులు గ్రామ సమీపంలోని పొలాల నుంచి బాలిక తలపై వరి దుబ్బుతో ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకువచ్చారు. ఆపై గౌరీపరమేశ్వరుల విగ్రహాలను ఏర్పాటు చేసి ఘనంగా పూజల చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొర్లె రవికుమార్, పాల సంఘం అధ్యక్షులు గొర్లె సత్యనారాయణ, గొంతిన సత్యారావు, టీడీపీ నాయకులు గొర్లె నూకునాయుడు, గొంతిన కృష్ణ, కరణం ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కుపై అవగాహన పెంచుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి సోమశేఖర్

కె.కోటపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ చట్టంపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ఉద్దేశాలు, నియమ నిబంధనలను వివరాచరు. చట్టానికి లోబడి పౌరులకు అందించాల్సిన సమాచారంపై అవగాహన కల్పించారు. పౌరులు అడిగిన సమాచారాన్ని 30 రోజుల్లోగా ఇవ్వాలని ఏవో స్పష్టం చేశారు. దీనిపై వ్యవసాయశాఖ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

నర్సీపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం జిల్లా నేత వీవీ రమణ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. అనంతరం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాము నాయుడు మాట్లాడుతూ ఉపాధి పనులను గ్రామసభల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలని మంత్రి పవన్ కల్యాణ్ చెప్పారని, ఇందుకు విరుద్ధంగా నాయకులు చెప్పిన పనులనే అధికారులు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరారు. నాయకులు గొల్లు గురుబాబు, లగుడు సత్యనారాయణ, ఎం.పాదాలు, ఎన్.శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ వద్ద ధర్నాకు అనుమతి లేదు

▸▸ అలా చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు: డీఎస్పీ మోహన్

నర్సీపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఈ నెల 6న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ ధర్నా చేస్తామని ప్రకటించారని, అయితే ధర్నాకు అనుమతి లేదని డీఎస్పీ మోహన్ తెలిపారు. సోమవారం పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయంలో డీఎస్పీ మోహన్, మైనింగ్ ఏడీ శివాజి, తహసీల్దార్ రామారావు సంయుక్తంగా విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మోహన్ మాట్లాడుతూ గత నెల 25న గబ్బాడ డిపో వద్ద గొడవ జరుగుందని తెలిసి సీఐ, ఎస్ఐ, సిబ్బంది అక్కడకు వెళ్లారని, ఆ సమయంలో అక్కడ కొంత మంది ప్రజా ప్రతినిధులు ఉన్నారన్నారు. విధుల్లో ఉన్న రెవెన్యూ సిబ్బందిని భయాందోళనకు గురి చేసినట్టు గత 26న ఉదయం 10 గంటలకు దనిమిరెడ్డి మధు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అదే రోజు 11 గంటలకు మాజీ ఎమ్మెల్యే గణేశ్ ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ రెండు ఫిర్యాదుల కేసు నమోదు చేసి రసీదులు ఇచ్చి లీగల్ ఒపినీయర్‌కి పంపామని తెలిపారు. కోనేటి రామకృష్ణ, బుల్లిదొర, ఏకా శివ ప్రసాద్ తమ విధులకు భంగం కలిగించారని గత నెల 27న వీఆర్వో రామకృష్ణ రూరల్ స్టేషన్ ఫిర్యాదు చేశారని తెలిపారు. ఇసుక డిపో ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ ఇసుక అక్రమ రవాణా జరగలేదని నివేదిక ఇచ్చారని, డిపోలో సీసీ పుటేజీలు కూడా పరిశీలించామని, ఇసుక అక్రమ రవాణా జరగలేదని నిర్ధారణ అయిందని తెలిపారు. అయితే ఈ నెల 6న మాజీ ఎమ్మెల్యే గణేశ్ రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్నట్టు మీడియా ద్వారా తెలిసిందని తెలిపారు. పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ రామారావు మాట్లాడుతూ 25 తేదీ సాయంత్రం 6.02 గంటలకు డిప్పర్లులో ఇసుక లోడింగ్ జరుగుందని సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ఇసుక అన్‌లోడింగ్ చేయించామని తెలిపారు. అక్కడ ఇసుక అక్రమ రవాణా జరగలేదన్నారు.



సమావేశంలో పాల్గొన్న డీఎస్పీ, తహసీల్దార్, మైనింగ్ ఏడీ

బుకింగ్ రసీదు లేకుండా లోడింగ్ ఎలా చేశారు?

ఇసుక బుకింగ్ రసీదు లేకుండా టిప్పర్‌లోకి లోడింగ్ ఎందుకు చేశారని, సిబ్బందిపై ఏమైనా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారా?, ఇసుక లోడింగ్‌కి వచ్చిన టిప్పర్లు మీద పోలీసులకు ఫిర్యాదు చేశారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు అధికారులు నీళ్లు నమిలారు. మైనింగ్ ఏడీ శివాజీ మాట్లాడుతూ ఆన్‌లైన్ బుకింగ్‌తో పాటు ఆఫ్‌లైన్ బుకింగ్‌కు అవకాశం ఉందని తెలిపారు. ఆఫ్‌లైన్ బుకింగ్‌లో కూడా డబ్బులు కట్టిన రసీదు చూపించకుండా లోడింగ్ చేశారని, దీనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని విలేకరులు ప్రశ్నించారు. దీనికి తహసీల్దార్ రామారావు సమాధానం చెబుతూ తప్పు జరుగుతుందని ముందుగా గ్రహించి జరక్కుండా ఆపామని సమాధానం చెప్పారు. సమావేశంలో పట్టణ, రూరల్ సీఐలు గోవిందరావు, రేవతమ్మ పాల్గొన్నారు.

ఎట్టకేలకు నీలబందకు విద్యుత్ సౌకర్యం

రోలుగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ల పంచాయతీ శివారు నీలబంద పీవీటీజీ గ్రామానికి ఎట్టకేలకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. కొండ శిఖర గిరి గ్రామమైన నీలబందకు నేటికీ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే రోడ్డు సౌకర్యం కూడా లేక రవాణాకు పడరాని పాట్లు పడుతున్నారు. పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా ఆ గ్రామానికి ప్రభుత్వం విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు నిధులను మంజూరు చేసింది. కాగా రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు సోమవారం నాలుగు కిలో మీటర్ల మేర విద్యుత్ స్తంభాలను మోయాల్సిన దుస్థితి దాపురించింది. నీలబంద గ్రామానికి 72 విద్యుత్ స్తంభాలు అవసరమని ఆ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

116 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

చోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎక్సైజ్ సీఐ కేవీ.పాపునాయుడు తెలిపారు. బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేట వద్ద మోటారు సైకిల్‌పై 116 మద్యం సీసాలను తరలిస్తున్న రావికమతం మండలం తోటకూరపాలెంకు చెందిన లెక్కల రమణను అరెస్టు చేసినట్టు చెప్పారు. మద్యం సీసాలు, బైక్‌ను సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు.

నైపుణ్య గణన కచ్చితంగా ఉండాలి: ఎంపీడీవో

రావికమతం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో నైపుణ్య గణన కచ్చితంగా చేపట్టాలని ఎంపీడీవో భానోజీరావు స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సోమవారం నైపుణ్య గణనపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్య గణన విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. నైపుణ్య గణన మండల కోఆర్డినేటర్ జి.శిరీష మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ప్రతీ ఇంటికి సర్వే సిబ్బంది వెళ్లి 15 నుంచి 59 ఏళ్ల లోపు సభ్యుల వివరాలు, వారి ఆధార్, రేషన్ కార్డుల నంబర్లు, విద్యార్హత, వృత్తి వివరాలు నమోదు చేయాలన్నారు. వీటితో పాటు ఏ వృత్తిలో శిక్షణ అవసరమో తెలుసుకుని నైపుణ్య గణన యాప్‌లో నమోదు చేయాలన్నారు. సాంకేతిక పరమైన సందేహాలు తలెత్తితే తమను సంప్రదించాలని సూచించారు. కాగా ఈ శిబిరానికి గైర్హాజరైన ఉద్యోగుల వివరాలను జిల్లా కలెక్టర్‌కు పంపుతామని ఎంపీడీవో తెలిపారు.



నైపుణ్య గణన శిక్షణ శిబిరానికి హాజరైన ఉద్యోగులు... మాట్లాడుతున్న ఎంపీడీవో భానోజీరావు

అబీద్ సెంటర్‌లో పండగ శోభ

▸▸ పూజా సామగ్రి కొనుగోలుదారులతో కిక్కిరిసిన మార్కెట్

నర్సీపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పండగ పూజా సామగ్రి కొనుగోలుదారులతో అబీద్ సెంటర్ కళకళలాడింది. మంగళవారం నాగులచవితి సందర్భంగా పూజా సమాగ్రి కొనుగోలు చేయడానికి సోమవారం సాయంత్రం స్థానికులు భారీగా తరలిరావడంతో రోడ్డు కిక్కిరిసిపోయింది. అబీద్ సెంటర్‌లోని కొబ్బరికాయలు, అరటి పండ్లు, పువ్వుల దుకాణాలు రద్దీగా కనిపించాయి. వీటికి మెయిన్ రోడ్డులో నేల దుకాణాలు భారీగా వెలశాయి. చెరకు గెడలు, పీచు టెంకాయ, నాగలి తువాళ్లు, నాగేంద్ర ప్రతిమలు, పత్తి విక్రయాలు జరిగాయి. దీంతో అబీద్ సెంటర్ వాహనాలు రాకపోకలకు తీవ్ర ఆటంకం ఎదురైంది.



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

ఖండివరంలో టీడీపీ సభ్యత్వ నమోదు

చీడికాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండివరం గ్రామంలో సోమవారం టీడీపీ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న వారందరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్నవారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, సాధారణంగా మరణిస్తే రూ.2 లక్షలు, దహన సంస్కరణ ఖర్చుల కింద రూ.10 వేలు పార్టీ నుంచి అందుతాయన్నారు. గ్రామంలోని టీడీపీ కార్యకర్తలతో పాటు అభిమానులంతా సభ్యత్వ నమోదుకు ముందుకురావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారు దయాకర్, ఎస్‌వీఎస్.నాయుడు, గండి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వాలను చూపుతున్న టీడీపీ నాయకులు

మాడుగులలో...

మాడుగుల: మండల కేంద్రంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఊపందుకుంది. పార్టీ ఆదేశాల మేరకు శాసన సభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో మాడుగులలో టీడీపీ నాయకులు, బూత్ ఇన్‌చార్జులు ప్రతీ ఇంటా తిరిగి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వం తీసుకోవడం వల్ల లభించే ప్రయోజనాలను కార్యకర్తలు, ప్రజలకు వివరించారు. సోమవారం 22, 23, 30 బూత్‌ల పరిధిలోని నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జులు కొట్టాడ మల్లికార్జునుడు, పల్లెల రాము, దువ్వా శంకర్, ఊడి అప్పారావు, దర్శిశెట్టి సూరిబాబు, జొన్నపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్డులను చూపుతున్న నాయకులు, కార్యకర్తలు

7న మెగా జాబ్‌మేళా

నర్సీపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరగనున్న ఈ మేళాకు అరబిందో ఫార్మా, డెక్కన్ కెమికల్స్, గ్లాండ్ ఫార్మా, అపోలో ఫార్మసీ, ఫ్యూచర్ ప్రాపర్టీ గ్రూప్, టీవీఎస్ తదితర 15 కంపెనీలు హెచ్‌ఆర్‌లు హాజరుకానున్నారని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

గ్రామసభలో 56 వినతులు

కృష్ణాదేవిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం సిహెచ్.నాగాపురంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో 56 వినతులు వచ్చాయని డిప్యూటీ తహసీల్దార్ కొండబాబు తెలిపారు. వీటిలో పట్టాదారు పాస్ పుస్తకాల్లో విస్తీర్ణం హెచ్చుతగ్గులు, పేర్ల మార్పుచేర్పుల కోసం ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సత్యనారాయణ, వీఆర్వో సత్యనారాయణ, కూటమి నాయకులు బొప్పన ప్రసాద్, వరహాలబాబు, రైతులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పెట్టుబడి కోసం రైతులకు రూ.20 వేలు ఇవ్వాలి

కృష్ణాదేవిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి కోసం రైతులకు ప్రభుత్వం రూ.20 వేలు సాయం అందించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకా సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పాతకృష్ణాదేవిపేట సచివాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు మేకా భాస్కరరావు, సాపిరెడ్డి బాబ్జి, గల్లా సన్యాసిరావు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

యువత స్వశక్తితో ఎదిగేలా తీర్చిదిద్దాలి

దేవరాపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరుద్యోగ యువతకు స్వయం శక్తితో ఎదిగేలా తీర్చిదిద్దాలని ఎంపీడీవో సువర్ణరాజు సూచించారు. నైపుణ్యాభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులతో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. స్కిల్ డవలప్‌మెంట్‌పై యువతకు శిక్షణ ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ స్వయంగా ఎదిగేలా తయారు చేయాలని సూచించారు. అలాగే స్వచ్ఛభారత్, ఓడీఎఫ్ సర్వేలు నిర్వహించాలని ఎంపీడీవో చెప్పారు.

రైతుల సమస్యలపై సచివాలయాల్లో వినతులు

చోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సాగునీటి వనరులు అభివృద్ధి చేయడంతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు సంఘం పిలుపుమేరకు సచివాలయాల్లో అధికారులకు రైతు సంఘం నేతలు సోమవారం వినతులు ఇచ్చారు. స్థానిక పంచాయతీ సచివాలయం వద్ద ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, చోడవరం పరిధిలోని సాగునీటి వనరులు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ ఈవో నారాయణరావుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

11న భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ధర్నా

చోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ తెలిపారు. స్థానిక వినాయక గుడి సెంటర్ వద్ద భవన నిర్మాణ రంగ కార్మికులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక కొరతతో కార్మికులకు పనులు లేకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరించి కార్మికులకు న్యాయం చేయాల న్నారు. డిమాండ్ల సాధనకు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోన నూకరాజు, కనకారావు, దేవుడుబాబు, పరమేశ్వరరావు, అప్పారావు, నాయుడు, ఈశ్వరమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన

చీడికాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ చట్టంపై రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఏవో రమాదేవి అవగాహన కల్పించారు. అడిగిన సమాచారం ఎలా ఇవ్వాలన్నది ఆమె వివరించారు.

కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్తగా వెంకటరావు



చోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా పట్టణానికి చెందిన గూనూరు వెంకటరావును నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా ఉన్న జగత శ్రీనివాసరావు స్థానంలో ఆయన్ను నియమించారు. కాగా తనను సమన్వయకర్తగా నియమించిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్నకు వెంకటరావు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకు రావడానికి కృషి చేస్తానని చెప్పారు.

సూపర్ ఫాలోయింగ్

జూనియర్ సూపర్‌స్టార్ కృష్ణకు విశేష ఆదరణ



సూపర్‌స్టార్ కృష్ణ గెటప్‌లో జనపరెడ్డి చిట్టిబాబు

ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, యూట్యూబ్, మోజో వంటి ప్లాట్‌ఫాంలు ఫాలో అయ్యేవారికి 'హలో ఫ్రెండ్స్ నేను మీ జూనియర్ సూపర్‌స్టార్ కృష్ణ' అంటూ పలకరించే జనపరెడ్డి చిట్టిబాబు సుపరిచితుడే. దివంగత సూపర్‌స్టార్ కృష్ణ వేషధారణలో ఆయన సూపర్‌హిట్ పాటలకు డ్యాన్సులు చేస్తూ అందర్నీ అలరిస్తుంటాడు. సరైన రహదారి, సెల్ సిగ్నల్స్ సరిగా లేని అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం మారుమూల కృష్ణంపాలెం పంచాయతీలోని కొత్తవలస అనే గిరిజన కుగ్రామానికి చెందిన చిట్టిబాబుకు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇన్‌స్టాలో లక్షా 45 వేల మంది ఫాలోవర్లు, ఫేస్‌బుక్‌లో లక్షా 13 వేల మంది అభిమానులు, యూట్యూబ్‌లో లక్షా 62 వేల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారంటే ఫ్యాన్ ఫాలోయింగ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

– చోడవరం-ఆంధ్రజ్యోతి

- ఇన్‌స్టాలో 1.45 లక్షలు, ఫేస్‌బుక్‌లో 1.13 లక్షల ఫాలోవర్స్
- యూట్యూబ్‌లో 1.62 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు
- సెల్ సిగ్నల్ సరిగా లేని కుగ్రామంలో అదరగొడుతున్న వ్యవసాయ కూలి
- రీల్స్‌తో లక్షల్లో లైకులు కొల్లగొడుతున్న చిట్టిబాబు



యూట్యూబ్ అవార్డు సిల్వర్ ప్లేబటన్‌తో చిట్టిబాబు

మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన జనపరెడ్డి చిట్టిబాబు చిన్నతనం నుంచి సూపర్‌స్టార్ కృష్ణ వీరాభిమాని. కృష్ణ పాటలకు స్టెప్పులు వేయడం, అలాగే డ్రెస్ చేసుకోవడం, హావభావాలు పలికించడం చేస్తూ పూర్తిగా జూనియర్ సూపర్‌స్టార్ కృష్ణగా మారిపోయాడు. సూపర్‌స్టార్ కృష్ణ పాటలతోనే రీల్స్ చేస్తుంటాడు. ఆ రీల్స్‌కు అభిమానులు ఫిదా అవుతుంటారు. అతని పాపులారిటీ ఎంత వరకు పెరిగిపోయిందంటే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలకు సైతం చిట్టిబాబును ఆహ్వానించి అతనితో డ్యాన్సులు కూడా వేయిస్తున్నారు. తానే సొంతంగా మేకప్ వేసుకోవడం, అవసరమైన కాస్ట్యూమ్స్ సమకూర్చుకోవడం, వాటితోనే ప్రదర్శనలు ఇస్తుండడం, షోలకు వెళుతుండడం గమనార్హం. చిట్టిబాబు చేసిన రీల్స్‌లో అత్యధికంగా 'ఇది మల్లెల మాసమని' పాటకు ఏకంగా నాలుగు మిలియన్ల వ్యూస్ రావడం విశేషం. దాదాపు అతని అన్ని రీల్స్‌కు రెండు నుంచి నాలుగు మిలియన్ల వ్యూస్ వస్తుంటాయి. తన ఇంటి పరిసరాలు, కొండల నడుమ రీల్స్ చేస్తుండడంతో సహజసిద్ధంగా ఉంటాయి.

టిక్‌టాక్‌లో రీల్స్‌తో తొలిసారిగా అడుగులు

2020 నుంచి టిక్‌టాక్‌లో చిట్టిబాబు.. కృష్ణ పాటలకు స్టెప్పులతో రీల్స్ ప్రారంభించాడు. టిక్‌టాక్ తరువాత కాలంలో ఆగిపోయినా ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, యూట్యూబ్, మోజో వంటి మాధ్యమాలలో తన వీడియోలు అప్‌లోడ్ చేయడం ప్రారంభించాడు. చిట్టిబాబు వీడియోలకు, రీల్స్‌కు అభిమానులు భారీ సంఖ్యలో పెరిగారు. పేద వ్యవసాయ కుటుంబానికి చెందిన అతను కొత్తవలస గ్రామంలో వ్యవసాయ కూలి. ఇంటర్మీడియట్ వరకు చదివాడు. చిట్టిబాబు డ్యాన్స్ చేస్తుంటే అతని భార్య షూట్ చేస్తుంది. ఎడిటింగ్ సొంతంగా చేసుకుని సిగ్నల్ ఉన్న ప్రాంతానికి వెళ్లి అప్‌లోడ్ చేస్తుంటాడు. సోషల్ మీడియాను షేక్ చేస్తున్న ఈ జూనియర్ సూపర్‌స్టార్ కృష్ణకు యూట్యూబ్‌లో లక్ష మంది సబ్‌స్క్రైబర్లు దాటిన సందర్భంగా కంటెంట్ క్రియేటర్లకు యూట్యూబ్ ఇచ్చే సిల్వర్ ప్లేబటన్‌ను ఇటీవలే అందుకున్నాడు. చిట్టిబాబు.. సూపర్‌స్టార్ కృష్ణ జయంతి, ప్రిన్స్ మహేశ్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా తన స్థాయిలో సేవా కార్యక్రమాలు చేస్తూ తన అభిమానాన్ని చాటుకుంటున్నాడు. తన రెండవ కుమారుడికి మహేశ్‌బాబు అని పేరు పెట్టుకున్నాడంటే అతని అభిమానం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

చాలా ఆనందంగా ఉంది



రీల్స్ ద్వారా ఈ విధంగా తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా అభిమానులను సంపాదించుకోవడం చాలా ఆనందంగా ఉంది. కృష్ణపై అభిమానం ఈ విధంగా నన్ను ముందుకు నడిపిస్తున్నది. ఆయన కుమారుడు మహేశ్‌బాబు అన్నా పిచ్చి అభిమానం. మారుమూల గ్రామం నుంచి ఈ స్థాయిలో పేరుతెచ్చుకోవడం ఎంతో సంతోషాన్నిస్తున్నది. ఓ వ్యవసాయ కూలిగా ఉన్న నేను యూట్యూబ్ నుంచి సిల్వర్ ప్లేబటన్ అవార్డు అందుకోవడం మరిచిపోలేనిది. ఇందులో నా భార్య జగదీశ్వరి సహకారం ఎంతో ఉంది. నా రీల్స్ చూసి ఇతర జిల్లాల నుంచి కూడా కృష్ణ అభిమానులు ప్రత్యేకంగా మాడుగుల వచ్చి అక్కడ నుంచి కష్టపడి మా గ్రామానికి చేరుకుని నన్ను పలకరిస్తున్నారంటే ఇదంతా సూపర్‌స్టార్ కృష్ణ చలవే. ఊపిరి ఉన్నంత వరకు కృష్ణ పాటలకు రీల్స్ చేస్తూనే ఉంటా.

– జనపరెడ్డి చిట్టిబాబు

అర్జీదారులకు న్యాయం చేయాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు అందజేసే వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుని వాటిని పరిష్కరించడం ద్వారా ప్రజలకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవి, పలు శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురు అర్జీదారులతో మాట్లాడి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్జీదారుల గోడును శ్రద్ధగా ఆలకించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 216 అర్జీలు అందినట్టు కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ దయానిధి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

అనకాపల్లి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ తుహిన్ సిన్హా పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించారు. ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చట్టపరిధిలోని సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారానికి సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 30 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు మోహనరావు, దేవప్రసాద్ పాల్గొన్నారు.

అఘోరీ హల్‌చల్

- వేంపాడు టోల్‌ప్లాజా వద్ద అలజడి
- నచ్చజెప్పిన పోలీసులు



టోల్‌ప్లాజా వద్ద కారులో వున్న అఘోరీతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు



ఎస్‌ఐతో మాట్లాడుతున్న అఘోరీ

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో వారం రోజులపాటు హల్‌చల్ చేసి, వివాదాస్పదంగా మారిన అఘోరీ (నాగసాధువు).. సోమవారం సాయంత్రం అనకాపల్లి జిల్లాలో ప్రత్యక్షమైంది. అక్టోబరు 31న తాను ప్రాణత్యాగం చేసుకుంటానని ఆమె చెప్పడంతో తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం కారులో అన్నవరం నుంచి విశాఖవైపు వెళుతూ వేంపాడు టోల్‌ప్లాజా వద్ద ఆగింది. స్థానికులు, టోల్‌ప్లాజా సిబ్బంది ఆమెను చూసేందుకు ఎగబడ్డారు. ఈ సమయంలో ఒక వ్యక్తి తనపై చేయి వేసి, తాకరాని చోట తాకాడంటూ ఆమె గొడవకు దిగింది. అతనెవరో తనకు తెలియాలని, సీసీ కెమెరా ఫుటేజీ కావాలని టోల్ ప్లాజా సిబ్బందిని డిమాండ్ చేసింది. తాను టోల్‌ఫీజు కోసమని కారు ఆపితే, ఆమె వాహనం నుంచి కిందకు దిగిందని, ఈ సమయంలో తాను చేతిని అడ్డుగాపెట్టానని, ఆమె కింద నుంచి వెళ్లే క్రమంలో చేయి తగిలి వుండవచ్చునని, ఉద్దేశపూర్వకంగా తాకలేదని టోల్ ప్లాజా వద్ద వున్న ఒక వ్యక్తి వివరణ ఇచ్చాడు. ఒక వేళ తప్పయితే క్షమించాలని కోరాడు. ఈలోగా అక్కడకు చేరుకున్న సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ సన్నిబాబు ఆమెతో మాట్లాడారు.

ఈ సందర్భంగా అఘోరీ మాట్లాడుతూ, ఏపీలో కూడా మహిళలకు రక్షణ లేదని, శివ సాన్నిధ్యంలో వుండే తన పట్లే అసభ్యంగా ప్రవర్తిస్తే, ఇక మహిళలకు రక్షణ ఎక్కడ వుంటుందని ఆమె ప్రశ్నించారు. తాను సనాతన ధర్మ పరిరక్షణ కోసం పాటుపడుతున్నానని చెప్పుకొచ్చింది. సీఐ, ఎస్‌ఐలు నచ్చజెప్పడంతో ఆమె కారులో విశాఖవైపు వెళ్లిపోయారు.

రాష్ట్రాన్ని బాగుచేసే శక్తినివ్వాలని ప్రార్థించా: ఎంపీ రమేశ్

తిరుమల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో అస్తవ్యస్తమైన ఈ రాష్ట్రాన్ని బాగుచేసే శక్తిని ప్రధాని మోదీకి, సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఇవ్వాలని శ్రీవారిని ప్రార్థించినట్టు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. అనకాపల్లిలో ఉద్యోగావకాశాలు కల్పించడంలో భాగంగా స్టీల్‌ప్లాంట్ రాబోతోందని, త్వరగా ఈ ప్లాంట్ పూర్తికావాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

కలెక్టరేట్ ఎదుట వీఆర్‌ఏల ధర్నా

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం మాదిరిగా ఏపీలో కూడా పే స్కేలు అమలు చేయాలని, అర్హత కలిగిన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖలో వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ తదితర ఖాళీ పోస్టులను అర్హులైన వీఆర్‌ఏలతో భర్తీ చేయాలన్నారు. వీటిలో 70 శాతం పోస్టులను వీఆర్‌ఏకు కేటాయించాలన్నారు. వీఆర్‌ఏల నైట్ వాచ్‌మెన్, ఇసుక డ్యూటీలను రద్దు చేయాలని, బీఎల్‌ఓ డ్యూటీల నుంచి వీఆర్‌ఏలను మినహాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఓ దయానిధిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రవికుమార్, సీఐటీయూ, వీఆర్‌ఏల సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

నిధులు మంజూరు చేసి, గోతులు పూడ్చడమే కాకుండా అవసరం మేరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు టెండర్లు పిలువగా 40 పనులకు టెండర్లు ఖరారయ్యాయి. మిగిలిన 28 పనులకు ఈ నెల 6వ తేదీతో టెండర్ల ప్రక్రియ ముగించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించనున్నారు.

మరో రూ.9 కోట్లతో ప్రతిపాదనలు

జిల్లాలో మిషన్ ఫర్ పాట్‌హోల్ ఫ్రీ రోడ్స్ పథకంలో భాగంగా మరో రూ.9 కోట్ల అంచనా వ్యయంతో 120 రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపినట్టు ఆర్‌అండ్‌బీ జిల్లా ఇంజనీరింగ్ అధికారి రమేశ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇప్పటికే మంజూరైన రోడ్ల పనులను టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతున్నదన్నారు. డిసెంబరు నెలాఖరుకు పనులు పూర్తిచేసి, సంక్రాంతి పండుగనాటికి రోడ్లకు కొత్తరూపు తేవాలన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

గాయపడిన వృద్ధురాలు.. చికిత్స పొందుతూ మృతి

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ బాత్‌రూములో జారిపడిపోయిన తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. పట్టణ ఎస్‌ఐ కె.సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శారదా గ్రంథాలయం రోడ్డులో నివాసం ఉంటున్న అల్లెపు సతీమణి(69) ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకుంది. ఈ నెల రెండో తేదీన బాత్‌రూమ్‌కు వెళ్లినప్పుడు కంటి చూపు సరిగా కనిపించకపోవడంతో కిందపోడిపోయింది. దీంతో గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఆదివారం రాత్రి ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. చికిత్స తరువాత కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. ఆమె కుమార్తె వి.మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఇది జలం కాదు.. గరళం

... 5వ పేజీ తరువాయి

మండిపడుతున్నారు. రసాయన వ్యర్థాల కారణంగా మల్లోడి గెడ్డవాగులో నీరు మొత్తం నల్లగా మారిపోయింది. గతంలో కూడా వ్యర్థ జలాలను గెడ్డవాగులోకి విడిచిపెట్టడంతో 'ఫార్మా యాజమాన్యాల ఇష్టారాజ్యం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. అప్పటో కాలుష్యం నియంత్రణ మండలి అధికారులు స్పందించారు. వాగులో నీటి నమూనాలను సేకరించి పరీక్షలు చేయగా రసాయనాలు ఉన్నట్టు గుర్తించారు. గెడ్డలోని నీటిని మోటార్లతో తోడించి రాంకీకి చెందిన సీఈపీటీకి తరలించారు. ఇది జరిగి మూడు నెలలు కాకముందే ఫార్మా కంపెనీల యాజమాన్యాలు వ్యర్థ జలాలను యథావిధిగా వాగులోకి విడిచిపెట్టడంతో సమస్య మళ్లీ మొదటికే వచ్చింది. ఫార్మా కంపెనీల యాజమాన్యాలు తమ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, మల్లోడి గెడ్డవాగులోకి ఫార్మా వ్యర్థాలను విడిచిపెట్టిన కంపెనీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఫార్మా వ్యర్థ జలాలతో ఇబ్బందులు



రొంగలి అయ్యబాబు, పరవాడ

ఫార్మా వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా ఇష్టానుసారంగా బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల కాలంలో ఫార్మా యాజమాన్యాలు మరింత బరి తెగిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థ జలాలను బయటకు విడిచిపెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు తక్షణమే కలుగజేసుకుని వ్యర్థ జలాలు రాకుండా చర్యలు చేపట్టాలి.

కంపెనీలను సీజ్ చేయాలి



గనిశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

ఫార్మా యాజమాన్యాలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. పీసీబీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల పరవాడ ప్రాంతంలో సాగునీటి చెరువులు వ్యర్థ జలాలతో కలుషితమయ్యాయి. ఫార్మా వ్యర్థ జలాలు శుద్ధి చేయకుండా నేరుగా బయటకు విడిచిపెడుతున్నారన్నదానికి ఈ చెరువులే సాక్ష్యాలు. ఫార్మా కంపెనీలపై నిఘా పెట్టి, వ్యర్థ జలాలను విడిచిపెడుతున్న వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు కంపెనీలను సీజ్ చేయాలి.

అపార్‌కు ఆపసోపాలు

... 5వ పేజీ తరువాయి

30వ తేదీలోగా పూర్తి చేయాలని గతంలోనే ఆదేశాలు జారీ అయ్యాయి.

జనన ధ్రువీకరణ పత్రాల కోసం అవస్థలు

పాఠశాల రికార్డుల్లో నమోదైన వివరాల ప్రకారం ఆధార్‌లో సవరణ చేసుకోవడానికి యూఐడీ వారు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేశారు. అయితే చాలా మంది విద్యార్థులకు జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో వాటి కోసం రెవెన్యూ, పంచాయతీ కార్యాలయాలు, ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. జనన ధ్రువీకరణ పత్రం కావాలంటే తొలుత పంచాయతీ కార్యాలయంలో నాన్- ట్రేస్డ్ సర్టిఫికెట్ తీసుకుని మీసేవా లేదా సచివాలయాల్లో తగిన ధ్రువపత్రాలతో తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలి. దీనిని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆర్డీఓకు నివేదిస్తారు. ఆర్డీఓ పరిశీలన అనంతరం పుట్టిన తేదీ ధ్రువపత్రం జారీ చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి 20 రోజుల నుంచి 30 రోజులు పడుతున్నది. అయితే అపార్‌లో నమోదుకు ఈ నెలాఖరు వరకే గడువు వుండడంతో పిల్లల జనన ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు అష్టకష్టాలు పడుతున్నారు.

ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో..

సచివాలయాల కేంద్రంగా కళాశాల, పాఠశాల విద్యార్థుల ఆధార్ సమస్యలు పరిష్కరించేందుకు గత నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆధార్ నమోదు కార్యక్రమాలను నిర్వహించారు. అక్కడ చిన్నచిన్న పొరపాట్లను మాత్రమే సరిచేశారు. పేరు, పుట్టిన తేదీల్లో తప్పులు సరిచేయడానికి జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. దీంతో ఆధార్ అప్‌డేట్ చేయడంలేదు. పాఠశాల స్టడీ సర్టిఫికెట్, గెజిటెడ్ సంతకం ఉన్నవాటిని కూడా అంగీకరించడం లేదు. రోలుగుంట, రావికమతం మండలాల్లో ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో నర్సీపట్నంలోని యూనియన్ బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు వద్ద ఉన్న ఆధార్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు.

పుట్టిన తేదీ సరిచేయడానికి అవస్థలు



కేదరి రేణుక, కల్యాణపులోవ, రావికమతం మండలం

ఆధార్ కార్డులో వున్న తేదీకి, జనన ధ్రువపత్రంలో వున్న తేదీకి తేడా వుంది. దీనిని సరిచేయకపోతే అపార్ కార్డు జారీ కాదని టీచర్లు చెప్పారు. దీంతో ఆధార్ కార్డులో పుట్టిన తేదీని సరిచేయించుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నాను. మాది రావికమతం మండలం. ఇక్కడ ఆధార్ నమోదు కేంద్రం లేదు. నర్సీపట్నంలోని ఆధార్ సెంటర్‌కు వెళ్లడంతో మూడు రోజుల తర్వాత టోకెన్‌లు ఇచ్చారు.

ఆదమరిస్తే అంతే!

... 5వ పేజీ తరువాయి

ఆటు, పోట్లు వస్తుంటాయి. ఆటు సమయంలో సముద్రంలో అలల తాకిడి అంతగా లేకుండా చెరువులా కనిపిస్తుంది. పోటు సమయంలో ఉగ్రరూపం దాల్చుతుంది. ఇక్కడ అలలు ఉవ్వెత్తున ఎగసి పడతాయి.

ఇదిలావుండగా సీతపాలెం కొండ పక్క నుంచి పూడిమడకకు ఉప్పుటేరు వస్తుంది. ఇది పూడిమడక చుట్టూ సుమారు ఐదు కిలోమీటర్ల మేర ప్రవహిస్తూ కడపాలెం శివారు కొత్తేరులో కలుస్తుంది. అక్కడ నుంచి తిరిగి సముద్రంలో కలుస్తుంది. అయితే ఉప్పుటేరు ప్రారంభం అయిన దగ్గర చాలా ప్రమాదకరం. పొగిరి వద్ద అలల ఉధృతి తీవ్రంగా ఉంటుంది. మత్స్యకారులే ఇక్కడ చాలా జాగ్రత్తగా ఉంటారు. ఈ ప్రాంతం పూడిమడకకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడకు వెళ్లడానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. అయితే ఈ ప్రాంతం అందాల గురించి తెలుసుకున్న అనకాపల్లిలో ఒక కళాశాలకు చెందిన విద్యార్థులు 2022 జూలై 29న ఇక్కడకు వచ్చారు. సముద్రంలో స్నానాలు చేస్తుండగా ఆకస్మికంగా వచ్చిన అలల ఉధృతికి కొట్టుకుపోయారు. వీరిలో ఎనిమిది మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పూడిమడక-లోవపాలెం రోడ్డు నుంచి తీరం వరకు సుమారు 50 అడుగుల వెడల్పున రోడ్డు వేశారు. దీంతో పొగిరి ప్రాంతానికి వెళ్లడానికి మార్గం సుగమమైంది. ఆదివారం విశాఖలోని నాయుడుతోట ప్రాంతానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఇక్కడ విహారానికి వచ్చారు. వీరిలో అభిరామ్ అనే విద్యార్థి అలల తాకిడికి సముద్రంలో మునిగి మృతిచెందాడు. అత్యంత ప్రమాదకరమైన పొగిరి ప్రాంతం వద్ద అధికారులు ఇక్కడ హెచ్చరిక బోర్డులు పెట్టడంతోపాటు ఎవరూ ఇక్కడ సముద్రంలో దిగకుండా చర్యలు చేట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డీఎస్సీకి రంగం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

చేపట్టలేదు. ఈ ఏడాది జనవరిలో నోటిఫికేషన్ ఇచ్చినా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రక్రియ ముందుకుసాగలేదు. వైసీపీ ఓటమి పాలై కూటమి అధికారంలోకి రావడంతో ఇచ్చిన మాట ప్రకారం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ ప్రకటన కోసం సుమారు 60 వేల మంది ఎదురుచూస్తున్నారు.